



భక్తజన సంద్రం!



అంతర్వేది భక్తజన సంద్రమైంది.. స్వామి కన్నులారా చూసేందుకు.. స్వామి వెంట నడిచేందుకు బుధవారం వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. స్వామి వెంట నడిచారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీ లక్ష్మీనర సింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్ర స్నానం నిర్వహించారు. గరుడ పుష్పక వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళ, కేరళ వాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. స్వామితో కలిసి పుణ్యస్నానం ఆచరించారు - వివరాలు 6లో

ఆ ఆనందం పేరు.. ఆకాశవాణి

రేడియో గుర్తుందా.. ఈ మాట అంటే చాలు 50 ఏళ్లు దాటినవారు ఎవరైనా ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌కి వెళ్లి వస్తారంతే.. ఎందుకంటే ఆ తరం వారికి రేడియోతో అంత అనుబంధం.. గతంలో అదే వినోద సాధనం.. ప్రసార మాధ్యమం.. అప్పటిలో ఎవరింట్లో చూసినా రేడియో ఉండాల్సిందే.. ఆకాశవాణి.. వార్తలు చదువుతున్నది అంటూ మొదలయ్యేది.. అది వింటూ ఆనందించాల్సిందే.. కాలం మారింది.. కాలంతోపాటు జనం మారారు.. రకరకాల ప్రసార సాధనాలు వచ్చేశాయి.. కొంతకాలం పాటు రేడియో మూలకు చేరింది.. ఇప్పుడిప్పుడే మళ్లీ రేడియోను జనం ఆదరిస్తున్నారు.. నాడు ట్యూన్ చేస్తే చాలు సమస్త సమాచారం వినిపించేది.. మరి నేడో ట్యూన్ చేస్తే సుమధుర గీతాలను ఆలపిస్తూ ఆనందం పరశింపజేస్తోంది.. అదే ఎఫ్‌ఎం రూపంలో నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం సందర్భంగా ఒకసారి రేడియో అభిమానులు పలకరిస్తే బోలెడు ముచ్చట్లు వినిపించారు.. ఒకసారి మీరూ చూడండి మరి..! - వివరాలు 6లో



పులి..చిక్కేనా!

పులుల కేరాఫ్ పాపికొండలు

అసలు ఉభయగోదావరి జిల్లాల్లో పులులు ఎన్ని ఉన్నాయి..? పులులా అవెక్కడుంటాయి..! మన జిల్లాల్లో అసలు పులులు లేవనేది చాలామంది వాదన. ఇది నిజం కాదు.. మన జిల్లాల్లోనూ పులులు ఉన్నాయి.. ఎక్కడో తెలుసా పాపికొండల అభయారణ్యంలో.. ఆ లెక్క ఎలా అంటారా.. నాలుగేళ్లకోసారి పులుల గణన చేపడతారు.. ఉభయగోదావరి జిల్లాల్లో 2022లో చేపట్టారు.. ఒక్క రోజు రెండు రోజులు కాదండోయ్ ఏకంగా 90 రోజులపాటు లెక్కించారు.. నాడు అభయారణ్యంలో ఆరు చిరుతలు.. నాలుగు పెద్ద పులులు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి.. వచ్చే ఏడాది మళ్లీ పులుల గణన చేపట్టనున్నారు.. ఎందుకంటే గతేడాది ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అడపాదపడా జనారణ్యంలోకి పులులు వచ్చిన ఘటనలు ఉన్నాయి.. దీనిలో భాగంగా ఇప్పటినుంచే అధికారులు సన్నద్ధమవుతున్నారు.. అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు..

- వచ్చే ఏడాదే పులుల గణన
- మే నెలలో లెక్కింపు
- 200కిపైగా సీసీ కెమెరాలు
- శ్రీశైలం నుంచీ నిపుణులు
- పులులు పెరిగే అవకాశం
- 12 ఉండొచ్చని అంచనా
- చివరిగా 2022లో సర్వే
- 6 చిరుతలు,4 పులులు గుర్తింపు
- 90 రోజుల పాటు సర్వే
- రంగంలోకి ఎన్‌టీసీఏ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో గోదావరికి ఇరువైపులా విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంఖ్యను లెక్కించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది మే నుంచి సర్వే చేపట్టాల్సి ఉండడంతో సన్నద్ధమవుతున్నారు. ఏటా నాలుగేళ్లకోసారి జాతీయ పులుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆదేశాల మేరకు అటవీశాఖ పాపికొండల్లో 90 రోజుల పాటు పులుల లెక్కింపు నిర్వహిస్తుంది. చివరిగా 2022లో సర్వే జరిగింది. నాలుగేళ్లు పూర్తవడంతో వచ్చే ఏడాది మేలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నారు. గతంతో పోల్చితే ఈసారి పాపికొండల్లో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పాపికొండలే ఆవాసం..

పులులు,చిరుత పులులకు పాపికొండల అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 2.60 లక్షల ఎకరాల్లో పాపికొండలు విస్తరించి ఉన్నాయి. దూరంలో చెప్పాలంటే మొత్తం 391 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్నాయి. పాపికొండల మధ్యలో గోదావరి నది ఉంది. అందుకే పులుల రక్షణ ప్రాంతంగా పాపికొండలు ప్రసిద్ధి చెందాయి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో ఇక్కడ అనేక రకాల పక్షులు, జంతువులు సంచరిస్తుంటాయి. దీంతో ఆహారం, నీటికి ఏ మాత్రం పులులకు ఢోకా ఉండదు. ఈనేపథ్యంలో పులుల ఆవాస ప్రాంతంగా ప్రసిద్ధి కెక్కింది.

ఈసారి పెరగడం ఖాయమే..

వచ్చే ఏడాది మేలో చేపట్టనున్న సర్వేకు సంబంధించి త్వరలో సన్నాహాలు ప్రారంభించడానికి అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి మరింత పగడ్బందీగా పులుల లెక్క తేల్చాలని భావిస్తోంది.ఈ మేరకు అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. వాస్తవానికి పలుసార్లు సర్వే కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా అవి చిక్కడం లేదు. దీనివల్ల వాస్తవ సంఖ్య తేలడం లేదు. మే నెలలో చేపట్టనున్న సర్వే సమయానికి అడవుల్లో చెట్ల ఆకులు రాలిపోయి కెమెరాలు బిగించడం కొంత సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అటు ట్రాప్ కెమెరాలో వీడియోలు సైతం రికార్డవడానికి అనువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతం నుంచి నిపుణులను రప్పించనున్నారు. ఈ దఫా సర్వేలో పాపికొండల అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. గడచిన నాలుగేళ్లలో వీటి సంతానం కూడా బాగా వృద్ధి చెంది ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం బాగా పెరిగిందని అటవీశాఖ అంచనా వేసింది. ప్రధానంగా రంప అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుతలు 12 వరకు ఉంటాయని చెబుతున్నారు.

చివరిగా 2022లో సర్వే

పాపికొండల్లో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నాయి? అనే దానిపై రాజమహేంద్రవరం అటవీ శాఖ అధికారులు రంపచోడవరం, కాకినాడ అటవీ శాఖల సాయంతో నాలుగేళ్లకోసారి పులుల లెక్కింపు చేపడతాయి. చివరిగా పాపికొండల్లో 2022లో పులుల లెక్కింపు జరిగింది. అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యం పరిధిలో 45 రోజులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభయారణ్యం పరిధిలో 45 రోజులపాటు సర్వే చేశారు. రెండు దశల్లో కలిపి అభయారణ్యంలోని 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పులుల సంఖ్య లెక్కించారు. నాలుగు పెద్దపులులు, ఆరు చిరుత పులులు గుర్తించారు. అయితే ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచనా వేశారు. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోను పులులకంటే చిరుతల సంచారం అధికంగా ఉందని నిర్ధారించారు. 2018లో నిర్వహించిన సర్వేలో అసలు ట్రాప్ కెమెరాలకు పులులు, చిరుతలు చిక్కలేదు. దీంతో ఆ ఏడాది సర్వే వివరాలు బయటపెట్టలేదు.

గతేడాది ఇలా..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యం నుంచి గతేడాది దారి తప్పి పులులు జనావాసాల్లోకి వచ్చేసిన సంఘటనలను గుర్తు చేస్తున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండల అభయారణ్యం నుంచి వచ్చింది. అక్టోబరులో ప్రత్తిపాడులో పులి సంచారం ఆనవాళ్లు బయటపడ్డాయి. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది. గతేడాది సెప్టెంబరులో రాజమహేంద్రవరం నగరంలోకి చిరుత పులి దారితప్పి వచ్చేసింది. ఇది పాపికొండల అభయారణ్యం నుంచే వచ్చిందని గుర్తించారు.అప్పట్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు అడవుల్లో పులులు, చిరుతల స్థావరాలు చెల్లాచెదురయ్యాయి. దీంతో కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో చిరుత గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అప్పట్లో అంచనా వేశారు. పాపికొండల అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతం లోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చి ఉండొచ్చని భావించారు. ప్రధానంగా ఈ తరహా సంఘటనలు 2022 నుంచి 2024 మధ్యే ఎక్కువగా జరిగాయి. పాపికొండల అభయారణ్యంలో పెరిగిన పులుల సంచారానికి ఈ ఘటనలు నిదర్శనంగా భావించొచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు. వచ్చే ఏడాది మే తర్వాత ఈ లెక్కకు సంబంధించి దాదాపు స్పష్టత రావొచ్చని చెబుతున్నారు.

నాటు కోడినీ.. వదల!



బర్డ్ ఫ్లూతో నాటు కోళ్లు మృత్యువాత

- పెంపకందారుల్లో భయం
- అక్కడక్కడా మృత్యువాత
- కానూరులో ఫారాలు ఖాళీ
- 500 నాటుకోళ్లు మృతి
- యజమానుల లబోదిబో
- శానిటేషన్‌కు చర్యలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూ భయపెడుతోంది.. కోళ్ల రైతులు, పెంపకందారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కరోనా జనంపై ఎంత ప్రభావం చూపిందో ప్రస్తుతం బర్డ్ ఫ్లూ కోడిపై అంత ప్రభావం చూపిస్తుంది.. బర్డ్ ఫ్లూ సోకిందంటే అప్పటి వరకూ ఆరోగ్యంగా కనిపించిన కోడి క్షణాల్లో మృత్యుఒడికి చేరుతోంది. ఈ వైరస్ లేయర్, బ్రాయిలర్ కోళ్లనే కాదు.. నాటు కోళ్లపై కూడా ప్రభావం చూపుతోంది. దీంతో కోళ్లను పెంచేవారు భయాందోళనకు గురవుతున్నారు.బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కోళ్ల ఫారాల్లో కోళ్లన్నీ ఖాళీ అయిపోయాయి. అటు ఫారం ఇటు నాటు కోళ్లు కూడా లేకుండా పోయాయి. వైరస్ కానూరు అగ్రహారంలో నాటు కోళ్లకూ పాకింది. దీంతో ఇళ్లల్లోని నాటు కోళ్లన్నీ వాటంతట అవే మృత్యువాత పడ్డాయి. ఖరీదైన కోళ్లు కూడా కళ్ల ముందే చనిపోయాయి.వాటిని దూరంగా పాతి పెట్టారు. మొత్తంగా కానూరు అగ్రహారం కోళ్ల ఫాంలలో 84 వేల కోళ్లు మృత్యువాత పడగా.. మిగిలిన 3 వేల వరకూ కోళ్లకు మత్తు మందు ఇచ్చి గోతుల్లో పూడ్చేశారు. మంగళవారం వైరస్ సోకిన 45 నాటుకోళ్లను స్వాధీనం చేసుకొని పూడ్చి పెట్టగా.. బుధవారానికి సుమారు 500 వరకూ నాటుకోళ్లు చనిపోయాయి. ఫారం కోళ్లతో పోలి స్తే వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండే నాటు కోళ్లకు కూడా వైరస్ ఒకేలా పని చేస్తుందని వెటినరీ వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన వెంటనే తగు జాగ్రత్తలతో కోడిని పాతి పెట్టేయాలి.. లేకపోతే వైరస్ కోళ్ల నుంచి మనుషులకు సంక్రమించే అవకాశం ఉం దన్నారు. కాగా.. బర్డ్ ఫ్లూ వైరస్ సాధారణంగా వలస పక్షుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. వందల వేల కిలోమీటర్ల నుంచి వలస వచ్చే పక్షుల్లో ఈ వైరస్ ఉంటే వాటి విసర్జితాల ద్వారా స్థానికంగా చాలా సులభంగా పాకి పోతుంది. గాలి ద్వారా కూడా బర్డ్ ఫ్లూ వైరస్ విస్తృతమవుతుంది.ఈ వైరస్ అత్యంత వేగంగా సోకడంతో పక్షులు, కోళ్ల గుంపులు గుంపులుగా చనిపోతాయి. ముఖ్యంగా తగు జాగ్ర త్తలు తీసుకోకపోతే మనుషుల ద్వారా ఈ వైరస్ ఎక్కువగా విస్తృతమయ్యే అవకాశం ఇచ్చినట్లే. వైరస్ సోకిన ప్రాంతానికి వెళ్లి అదే వస్త్రాలతో వేరొక చోటికి వెళితే అక్కడి కోళ్లకు ఫ్లూ వస్తుంది. అందువల్ల వైరస్ సోకిన చోటుకు వైద్యులు మినహా ఎవరూ వెళ్లకూడదు.బర్డ్ ఫ్లూ వైరస్ ఊపిరితిత్తులు, గాలి వాహికలో తిష్ట వేసి నాశ నం చేస్తుంది.కోళ్లను పాతి పెడితే వాటికి సోకి న వైరస్ భూస్థాపితం అయినట్లేనన్నారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా గురువారం నుంచి ఫారాల్లో శానిటైజేషన్ చేస్తామని జిల్లా పశు సంవర్ధకఅధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వైరస్‌తో చనిపోయిన కోళ్లు తినవద్దు!

ఐఎంఏ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలెవరు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజయకుమార్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా వచ్చే దగ్గు, వంటి నొప్పులు, జ్వరం, కండరాలు నొప్పులు వంటిదే బర్డ్ ఫ్లూ అని చెప్పారు. ఈ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కోళ్ళ ఫారాల్లో బర్డ్‌ఫ్లూ ఉండడంతో ఫారాల్లో పనిచేసేవారికి సోకే అవకాశం ఉం దన్నారు.పౌల్ట్రీ ఫారాల్లో పని చేసేవారు మా స్కులు, చేతులకు గ్లౌజులు వేసుకుని పనిచేస్తే వైరస్ బారిన పడరని చెప్పారు. వైరస్‌తో చనిపోయిన కోళ్లను తినకూడదన్నారు. బాగా ఉడికించిన కోడి మాంసం, గుడ్లను తినడం వల్ల ప్రమాదం రాదన్నారు. బర్డ్ ఫ్లూ మ్యూటేషన్ చెందితే ప్రమాదం ఉంటుందని అయితే ప్రజలు అధిక సంఖ్యలో బర్డ్ ఫ్లూ బారిన పడినప్పుడే మ్యూటేషన్ అనేది జరుగుతుందన్నారు.ప్రస్తుతం భయపడాల్సిన పనిలేదన్నారు.సమావేశంలో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ గుప్తా, డాక్టర్ వడ్డాది సురేష్, డాక్టర్ శేషాద్రి రెడ్డి, డాక్టర్ పాండురంగరాజు,డాక్టర్ సుమన్, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

సమాచారం సకాలంలో ఇవ్వకపోతే ఎలా ?

డీఈవో వాసుదేవరావు అసహనం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కార్యాలయానికి సమర్పించాల్సిన ముఖ్యమైన సమాచారాన్ని సమయానికి అందజేయకపోవడం విచారకరమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. రాజమహేంద్రరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం అర్బన్‌లోని ప్రైవేట్ పాఠశాల ల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమైన సమాచారాన్ని సకాలంలో ఇవ్వాలన్నారు. సమ్మెటివ్ మార్కులను ఆన్‌లైన్ చేయడం, యు డైస్ అప్‌డేట్ కాకపోవడం, అపార్ సంఖ్యలు నూరుశాతం పూర్తిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.శనివారంలోపు విద్యాశాఖ సూచించిన పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నిక సజావుగా జరగాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి) : ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సునీత పేర్కొన్నారు. పెరవలిలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించి మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికల పక్రియ నిర్వహిస్తున్నందున ఎటువంటి పొరపాట్లు లేకుం డా ఎన్నికలు జరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజున ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఓటర్ల స్లిప్‌లు జారీ, పోలింగ్ సామగ్రి ముందస్తుగా తరలించాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారిగా టి. సీతారామమూర్తి వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.జిల్లాలో 82 పోలింగ్ కేంద్రాలను, 10 యాక్సెలరీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

టెన్త్‌కు ఎస్సీ హాస్టల్స్ విద్యార్థులు 178 మంది హాజరు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మార్చి నెలలో జరిగే టెన్త్ పరీక్షలకు జిల్లాలోని ఎస్సీ హాస్టల్స్‌లో చదువుకుంటున్న 178 మంది విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శోభారాణి తెలిపారు. ఈమేరకు టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, వారి ఉత్తీర్ణత శాతం పెరిగేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. టీచర్స్ రూపొందించిన స్టడీ మెటీరియల్ ఇప్పటికే విద్యార్థులకు అందజేశామన్నారు. స్కూల్స్‌లో ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తున్నారని, అలాగే హాస్టల్స్ లోనూ చదివిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ చదవాలని.. టెన్త్‌లో వచ్చే మార్కులపై భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు.

రెవెన్యూ తప్పులను సరిచేస్తాం : జేసీ

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రికార్డుల్లో పొరపాట్లు సరిచేసుకోవడడానికి రైతులు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే మీ వద్దకు వచ్చి పరిష్కరించడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలో రైతులకు సంబంధించి భూ,రెవెన్యూ రికార్డుల్లో తప్పులు, వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ పొరపాట్లను సరిచేసి రైతులకు పత్రాలు పంపిణీ చేశారు. ప్రతి మంగళ, బుధవారాలు కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో రైతుల నుంచి వచ్చిన రెవెన్యూ ఫిర్యాదులను పరిశీలించి, తప్పులను సరిచేసి రైతులకు సరిచేసిన పత్రాలను ఆర్డీవో కార్యాలయంలోనే పంపిణీ చేస్తామన్నారు.9 మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తునిలో బాలుడి కిడ్నాప్ కేసు.. పీఈటీయే నిందితుడు

7




తవ్వేయ్..అమ్మేయ్!

ఉచిత ఇసుక విధానానికి కూటమి నాయకుల తూట్లు

నిడదవోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకాన్ని ఆ పార్టీ నాయకులే పక్కదారి పట్టిస్తున్నారు.పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్ల నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా ర్యాంపుల నుంచి ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లవచ్చునన్న ప్రభుత్వ విధానానికి తూట్లు పొడుస్తున్నారు. టీడీపీకి చెందిన ఒక నాయకుడి అండదండలతో కొందరు దళారులు వరంగా మార్చు కున్నారు.దీంతో ఇసుక మాఫియా అక్రమ ఇసుక విక్రయాలకు తెరలేపింది. నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి అనధికారికంగా ఇసుక తరలిపోతోంది. కూటమి ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జీలను తుంగలో తొక్కి అనధికారికంగా అధిక సొమ్ములు వసూలు చేస్తున్నారు. టీడీపీకి చెందిన ఒక నాయకుడి అండదండలతో ఒక మండల నాయకుడు పెండ్యాల ఇసుక ర్యాంపును సొంత ర్యాంపుగా మార్చేసుకున్నాడనే విమర్శలున్నాయి. పేరుకు మాత్రం రోజుకు 25 నుంచి 50 వరకు లారీలకు ఇసుక సరఫరా చేస్తున్నట్టు అధికారికంగా చూపిస్తూ అనధికారికంగా 100 నుండి 150 లారీల వరకు ఇసుక తరలించేస్తున్నారని ఇసుక ర్యాంపుల వద్ద బాహాటంగా విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతూ ఇసుక విక్రయాల సొమ్మును స్వంత ఖాతాలకు పక్కదారి పట్టిస్తున్నారు. అయినా ప్రభుత్వ అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేక పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని ర్యాంపుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.అయినా చర్యలు శూన్యం.జిల్లా ఉన్నతాధికారులు ర్యాంపులపై దృష్టి సారించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం

ఆ ఆనందం పేరు 'ఆకాశవాణి..



బుల్లి పెట్టెలో బూచోడు..


రేడియోలో పాటలు వింటున్న డాక్టర్ విజయారెడ్డి

బూచాడమ్మా బూచాడు.. బుల్లెపెట్టిలో ఉన్నాడు.. కళ్లకెప్పుడూ కనబడడు.. కబుర్లెన్నో చెబుతాడు అంటూ రేడియోలో పాట విని ఎంతో కాలమవుతుంది. సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగి సెల్‌ఫోన్లు, టీవీలు రావడంతో రేడియోలన్నీ మూలకు చేరిపోయాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కూడా రేడియోలో వార్తలు వింటూ సిలోన్ నుంచి వచ్చే పాటల కోసం ఎదురుచూస్తున్నారంటే ఆశ్చర్యమే మరి.

అమలాపురం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డికి రేడియో అంటే ప్రాణం. అమలాపురంలోని ఫిలిప్స్ షోరూంలో 1997లో కొనుగోలు చేసిన రేడియోనే నేటికీ ఆయన వినియోగిస్తున్నారు. మండల పశువైద్యాధికారిగా పనిచేసే సమయంలో 27 ఏళ్ల కిందట ఆయన ఈ రేడియోను కొనుగోలు చేశారు. ఎప్పుడైనా ఆ రేడియో పాడైతే వెంటనే బాగు చేయించుకుని వచ్చి వినియోగిస్తూ ఉంటారు. సెల్‌ఫోన్ కంటే రేడియో ఉత్తమమని చెబుతారాయన. శ్రోతలు కోరిన ఎన్నో మంచి మంచి పాటలు వినడంతో పాటు సత్యమైన ఆకాశవాణి వార్తలు వింటూ ఉంటానన్నారు. ఆ పాత మధురమైన పాత పాటలు రేడియోలో వింటే ఆ ఆనందమే వేరంటున్నారు. మూడు పెద్ద సైజు నిప్పో బ్యాటరీలతో పనిచేసే ఆ రేడియో పట్టణ ప్రాంతాలకంటే గ్రామీణ ప్రాంతాల్లో బాగా పనిచేస్తుందని, పల్లె ప్రాంతాల్లో విధులకు వెళ్లినప్పుడు ఖాళీ దొరికితే ఆ రేడియో తనకు మంచి నేస్తంగా మారిపోతుందని చెప్పారు. - అమలాపురం టౌన్

ఆ ఇల్లే.. ఓ రేడియో..



నిద్ర లేవగానే రేడియో ఆన్‌చేసే రోజులవి. కరెంటుతో సంబంధం లేకుండా బ్యాటరీలే ఆధారంగా రేడియోలు పనిచేసే రోజులవి. పల్లె, పట్టణమన్న బేధం లేకుండా ప్రజలకు 1960, 1970 దశకాల్లో రేడియో అతిపెద్ద వినోద సాధనం. వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా యధార్థమైన వార్తలను ప్రసారం చేస్తూ ప్రజలందరినీ పాటలతో పరశింపచేసిన రోజులవి. ఆ రోజుల్లోనే అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో రావూస్ రేడియో సర్వీస్ సెంటర్‌ను రావూస్ నాగేశ్వరరావు 1970వ దశకంలో ప్రారంభించారు. ఫిలిప్స్ రేడియో ఆథరైజ్డ్ డీలర్ షిప్‌ను దక్కించుకున్నారాయన. రేడియో మెకానిక్‌గా పేరొందిన నాగేశ్వరరావు గడియారస్తంభం సెంటర్‌లోని తన ఇంటిని ఫిలిప్స్ రేడియో ఆకారంలో డిజైన్ చేయించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్షణం తీరిక లేకుండా రేడియోలు విక్రయించారాయన. ఎక్కెడెక్కడో సుదూర ప్రాంతాల నుంచి సైతం వచ్చినవారు రావూస్ నాగేశ్వరరావు రేడియో షాపులో రేడియోలు కొనుగోలు చేసేవారని నాటితరం వారు నేటికీ చెబుతున్నారు. 1980వ దశకంలో టేప్‌రికార్డర్లు రావడంతో రేడియోల వినియోగం తగ్గింది. కాలక్రమంలో సీడీ ప్లేయర్లు, ఇతర వినోద సాధనాలు అందుబాటులోకి రావడంతో క్రమక్రమంగా వ్యాపారం సన్నగిల్లింది.

- అమలాపురం టౌన్

రేడియో.. ఓ చరిత్ర



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో నలుదిక్కుల సమాచారాన్ని చేరవేసే తొలి ప్రసార సాధనంగా రేడియో చరిత్ర సృష్టించింది. ప్రపంచ సమాచార వ్యవస్థ గతినే రేడియో మార్చేసింది. గాలి, ధ్వని తరంగాల ద్వారా సమాచారాన్ని క్షణాల్లో విశ్వాన్ని చుట్టేదే రేడియో. నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. రేడియోను మానవాళికి కానుకగా ఇచ్చినవాడు మార్కోని. మార్కోనికి ముందు పద్దెనిమిదవ శతాబ్దంలో రేడియో సాంకేతికతకు కొంత ప్రయత్నం జరిగింది. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన జేమ్స్ మాక్స్ వెల్, జర్మనీకి చెందిన హెర్జ్, కాథలిక్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎడ్వర్డ్ బ్రాన్లీ రేడియో సాంకేతికతకు పునాదులు వేశారు. ఆ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని 1896లో రేడియోకి ఒక రూపాన్ని ఇచ్చాడు మార్కోని. అయితే దాని ప్రసార పరిధి రెండు కిలోమీటర్ల దూరానికే పరిమితమైంది. 1907లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన జాతీయ గీతాన్ని ఒక ఓడ నుంచి మరో ఓడకి ప్రసారం చేయడంలో రేడియో ముందడుగు వేసింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధ నౌకకు వైర్‌లెస్ ద్వారా మార్కోని సందేశం పంపించాడు. ఇలా రేడియో విశ్వవేదిక మీదుకు అడుగుపెట్టింది. మన దేశంలో రేడియో ప్రసారం 1923 జూన్ నెలలో జరిగింది. బొంబాయి రేడియో క్లబ్ దానికి నేతృత్వం వహించింది. ఆ తర్వాత బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ఆధ్వర్యంలో 1927లో కలకత్తా, బొంబాయి నగరాల్లో రేడియో ప్రసారాలు అందుబాటులోకి వచ్చాయి. 1936లో ఆకాశవాణి ప్రభుత్వ సంస్థగా అవతరించింది. ఆ తర్వాత మద్రాసు కేంద్రంగాను, అటుపై విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాల నుంచి రేడియో ప్రసారాలు జరిగేవి. ప్రతి ఇంట్లోను, షాపులోను, టీ దుకాణాల్లోను, హోటళ్లలోను ఇప్పుడు ఎల్‌సీడీ టీవీల మాదిరిగా రేడియోలు అప్పట్లో కనిపించేవి. 1946లో స్వాతంత్రోద్యమ సమయంలో రేడియో అత్యంత కీలక పాత్ర పోషించింది. రేడియో భారతదేశంలోకి ప్రవేశించి ఇప్పటికి 102 ఏళ్లు.

ప్రకృతి విపత్తుల్లో నమ్మకమైన నేస్తం..

ఉభయ గోదావరి జిల్లాల్లో తరచు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి. అలాంటి సమయంలో రేడియో గొప్ప నేస్తంగా నిలిచేది. విశాఖ ఆకాశవాణి నుంచి మనకు ప్రసారాలు వస్తుంటాయి. 1986లో గోదావరి జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించినప్పుడు విశాఖ ఆకాశవాణి వరదల సమాచారం, అప్రమత్తత గురించి వందలాది బులిటెన్లు అందించింది. 1996లో తుఫానుకు కోనసీమ కకావికలమైనప్పుడు కూడా అక్కడి నుంచే సమాచార ప్రసారాలను అందించింది. ఈ సమయానికి టీవీ ఛానళ్ల ప్రభావం పెరిగినప్పటికీ విద్యుత్ సరఫరాతో సమాచారం అందే పరిస్థితి లేదు. విశాఖ మీడియం వేవ్‌తోపాటు విశాఖ ఎఫ్‌ఎం కూడా విశేషమైన సేవలందించింది.

పాతకాలం వస్తువైపోయింది..


ప్రసారాలను వింటున్న నాగేశ్వరరావు

రేడియో ఓ పాతకాలం నాటి వస్తువైపోయింది. కానీ ఇప్పటికీ ఆయనకు రేడియోనే ప్రధాన ప్రసార సాధనం. పేరు వజ్రపు నాగేశ్వరరావు. సామర్లకోటలోని సంపెంగతోటకు చెందిన ఈయన సంపెంగపూల వ్యాపారి. ఇంటి వద్ద నిత్యం రేడియోతోనే కాలక్షేపం చేస్తాడు. ఇప్పటికీ వార్తలతోపాటు పాటలు, కాలక్షేపం కబుర్లు వింటూ ఉంటాడు. అటుగా పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు అతడి రేడియో కాలక్షేపాన్ని ఆసక్తిగా గమనిస్తుంటారు. గత నలభై ఏళ్లుగా రేడియో వింటున్నానని ఆయన చెప్పాడు. తన రేడియోలో వాడే బ్యాటరీల కోసం నెలకు రూ.100 వరకూ ఖర్చుపెడతానని చెప్పాడు.

- సామర్లకోట

మదిలో మెదులుతున్నాయి..



ఆధునిక టెక్నాలజీతో ఎఫ్‌ఎం రేడియో తరం వచ్చినా నా చిన్ననాటి ఆకాశవాణి ప్రసారాలే నేటికీ మదిలో మెదులుతున్నాయి. మా చిన్నాన్న గారు ఇంట్లో మార్ఫి రేడియో ఉండేది. మాపిన్ని శకుంతలకు ఉదయం భక్తిరంజని అంటే చాలాఇష్టం. అందులో ఎస్పీ బాలు భద్రాచల రామదాసు కీర్తనలు, ఎమ్మెస్ రామారావు హనుమాన్ చాలీసా ఎక్కువగా వినేవాళ్లం. 1984లో నేను డిగ్రీ చదివే రోజుల్లో ఎక్కువగా ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రసారం చేసే యువవాణి వినేవాడిని. డీఎస్‌ఆర్ ఆంజనేయులు చాలా చక్కటి కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేసేవారు. నేను ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఉభయకుశలోపరి కార్యక్రమానికి ఉత్తరాలు రాసేవాడిని. శ్రోతల అభిప్రాయాలను రేడియోలో తెలియజెప్పేటప్పుడు నా పేరు రేడియోలో వినేందుకు మా కుటుంబ సభ్యులంతా ఆత్రుతగా ఎదురుచూసి పేరు చదవగానే ఆనందపడేవాళ్లం.

పరస జగన్నాథరావు, ఉపాధ్యాయుడు, రాజమహేంద్రవరం

- రాజమహేంద్రవరం సిటీ

నేడు ఎఫ్ఎంకు ప్రాధాన్యం



రేడియో ఆకాశవాణికి గతంలో చాలా ప్రాధాన్యం ఉండేది. క్రమేపీ ఆధునిక యుగంలో రేడియోలో కొత్త చానల్స్ ప్రవేశించాయి. అప్పుడు ఆకాశవాణి ఉంటే, ఇప్పుడు ఎఫ్‌ఎం రేడియో ప్రవేశించింది. చాలామంది తమ సెల్‌ఫోన్లలో, కార్లు, ఆటోలు, బస్సుల్లో ఎఫ్‌ఎమ్ రేడియోలను వినియోగించి సినిమా పాటలు, హాస్య సంభాషణలుతో ఆనందం పొందుతున్నారు.

ప్రధాని మన్‌కీ బాత్‌తో..

ఇప్పటికీ రేడియో ప్రత్యామ్నాయ నిరంతర ప్రసార సాధనంగానే ఉంది. విద్యుత్‌తో పనిలేకుండా పనిచేసే మీడియం. మారుమూల కుగ్రామాలకు సైతం రేడియో ప్రసారాలు వినిపించగలవు. అందుకే ప్రధాని మోదీ రేడియోను ఒక శక్తివంతమైన ప్రసార సాధనంగానే వినియోగిస్తున్నారు. మన్‌కీ బాత్ (మనసులో మాట) పేరుతో ప్రతి నెల ప్రజల ముందుకు వస్తున్నారు. కుగ్రామాల్లో, కొండల్లో, గుట్టల్లో తన వాణిని వినిపించేలా మోదీ అద్భుతంగా రేడియోని వినియోగించుకోవడం విశేషం.

బావగారి కబుర్లు గుర్తున్నాయా..!

ఉదయాన్నే భక్తిరంజని వింటూ ఇంటి పనులు కానిచ్చేవారు. భక్తిరంజనిలో ఆరోజుకు అనుగుణంగా భక్తి కార్యక్రమాలు ప్రసారమయ్యేవి. శనివారం వెంకటేశ్వర సుప్రభాతం, ఆదివారం ఆదిత్య హృదయం, సోమవారం శివస్తోత్రం.. ఉదయం అర్ధగంటపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆకాశవాణి శ్రోతలను రంజింపజేసేది. ఉదయం 7 గంటలకు తెలుగులో వార్తలు, 8 గంటలకు ఆంగ్లంలో, అనంతరం హిందీలో వార్తలు. తెలుగు వార్తలంటే తిరుమలశెట్టి శ్రీరాములు గుర్తుకు రాకమానరు. 'ఈ ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఓడిపొయ్యారు(ఓడిపోయారు).' ఎన్నికల వార్తలు చదవడంలో ఆయన భాషలోని యాస అందరినీ ఆకట్టుకునేది. ఇక మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమంలో కార్మికుల కోసం పలు కార్యక్రమాలు. అనంతరం బావగారి కబుర్లు. ఈ కబుర్లలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు వివిధ అంశాలపై శ్రోతలకు అర్థమయ్యేలా బావగార్లు మాట్లాడుకోవడం శ్రవణానందంగా ఉండేది. వనితావాణి, మహిళా మండలి కార్యక్రమాలు అతివలను ఎంతగానో ఆకట్టుకుంటూ కొనసాగేవి. చిత్రసీమ, శ్రోతలు కోరిన పాటలు, చిత్రరంజని సినిమాగీతాల కార్యక్రమాలకు రేడియోల వద్ద చిన్నల నుంచి పెద్దల వరకు కాపుకాసేవారు. పాటల కోసం ఉత్తరాలు రాసిన శ్రోతలు తమ పేరు చదవగానే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన ఆ క్షణాలు ఎలా మరచిపోగలం. బుధవారం, శనివారం రాత్రి అరగంటసేపు ప్రసారమయ్యే నాటికల కోసం జనం ఎదురుచూసేవారు. ఆదివారాల్లో వారం విడిచి వారం ప్రసారం చేసే ఒక గంట వ్యవధి రేడియో నాటకం, ఆకాశవాణి సంక్షిప్త శబ్దచిత్రాల కోసం పడిగాపులు పడిన రోజులు చాలామందికి గుర్తుండే ఉంటుంది. సంగీత ప్రియులకోసం కర్ణాటక, హిందూస్థానీ సంగీత కార్యక్రమాలు, లలిత సంగీతం వంటి వివిధ కార్యక్రమాలు ఆయా వర్గాల శ్రోతల కోసం ప్రసారమయ్యేవి. చిన్నారుల కోసం బాలానందం వంటి కార్యక్రమాలను రూపొందించి రేడియో అన్నయ్య, అక్కయ్యలను జనం ఇంకా గుర్తుంచుకున్నారు. రైతుల కోసం పొలం పనులు, పాడిపంటలు ప్రసారం చెయ్యడంలో విజయవాడ, హైదరాబాదు కేంద్రాలు పోటీపడేవి. సిలోన్ (శ్రీలంక) ఆకాశవాణి కేంద్రాన్ని గుర్తుచేసుకోకపోతే ఎలాగండీ?? సాయంత్రం సిలోన్ కేంద్రం ద్వారా ప్రత్యేకంగా ప్రసారమయ్యే తెలుగు సినిమా పాటల కోసం పాటల ప్రియులు ఎదురుచూసేవారు. క్రికెట్ మ్యాచ్ లైవ్‌ను రేడియో ద్వారా విని క్రీడాభిమానులు తెగ సంబరపడేవారు. నిజానికి క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో రేడియోల విక్రయాలు ఎక్కువగా జరిగేవంటే అతిశయోక్తి కాదు. ఇలా ఆకాశవాణి అన్ని వర్గాల జనానికి చేరువై దూరదర్శన్ అవతరణ అనంతరం క్రమంగా దూరం జరుగుతూ వచ్చింది.

- ఉప్పలగుప్తం

కన్నుల పండువగా చక్రస్నానం

- అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన సముద్ర తీరం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు


గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి చక్రస్నానాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు ఆలయం వద్ద నుంచి అలంకార మండపంలో అర్చకుల పూజలందుకున్న స్వామివారిని రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడ పుష్పక వాహనంపై పెట్టి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళ, కేరళ వాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామికి, చక్రపెరుమాళ్ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి, పేరూరు ఉద్దండ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజా బహుదూర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల, డీసీ రమేష్‌బాబు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, డీఎస్పీ మురళీమోహన్, పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, పోతు రాజు శ్రీవేంకటకృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, సీఐలు నరేష్ కుమార్, భీమరాజు, ఎస్ఐ కె. దుర్గాశ్రీనివాస్, వాహనకారులు, భక్తులు, తదితరులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సముద్ర తీర మంతా భక్తులతో కళకళలాడింది. అనంతరం ఎమ్మెల్యే కూటమి శ్రేణులు, దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులు పోలీసులు పుణ్యస్నానాలు ఆచరించారు.


ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఆర్డీవోలు, డీసీ, ఏసీ

● నేడు స్వామివారి తెప్పోత్సవం

కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఉదయం సుప్రభాతసేవ, తిరువారాధన, బాలభోగం, సాయంత్రం ఐదు గంటలకు అప్పనపల్లి వాస్తవ్యులు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు వారిచే నిర్మితమైన పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరగనుంది. సాయంత్రం ఆరు గంటలకు చివరి ఘట్టమైన శ్రీస్వామివారి తెప్పోత్సవం ఆలయ ఉత్తర ఈశాన్యంలో ఈ ఏడాది నూతనంగా ఏర్పాటుచేసిన చెరువులో మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాలంకరణలతో చేసిన హంసవాహనంపై బ్రహ్మాండమైన బాణసంచా కాల్పులతో వెంప వాస్తవ్యులు గొట్టుముక్కల భీమరాజు సహకారంతో తెప్పోత్సవం జరగనుంది. రాత్రి ఎనిమిది గంటలకు తిరుమంజనములు, దర్పణసేవ, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోల విన్నపం, తీర్థగోష్టి, శ్రీస్వామివారి పవళింపుసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.


తీరాన్ని తాకిన భక్త జనసందోహం


సముద్ర తీరంలో చక్ర, జల్లుస్నానాలను పరిశీలిస్తున్న ఆర్డీవోలు

ఆనందోత్సాహాలతో ..

భీమేశ్వరుడి వసంతోత్సవం


కల్యాణమూర్తులపై వసంతాలు పోస్తున్న అర్చకస్వాములు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి: ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి వసంతోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం త్రిశూల, శ్రీచక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం వేగాయమ్మపేట ఆస్థాన మండపం వద్ద నుంచి కల్యాణమూర్తులు మాణికాంబ సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామి వార్లను రథంపై ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం నిత్యపూజ, అర్చనలు జరిగాయి. తదుపరి మండపారాధన, నాకబలి పూజలు ఆగమ పండితులు దేవులపల్లి ఫణిరామకృష్ణ నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం వసంతోత్సవం జరిగింది. కల్యాణమూర్తులైన అమ్మవారు, స్వామివార్లకు వసంతాలు చల్లారు.

అనంతరం అర్చక స్వాములు కల్యాణమూర్తులను చేతపట్టి వసంతాలు జల్లుకున్నారు. మంగళవాయిద్యాలకు అను గుణంగా లయబద్ధంగా నృత్యంచేస్తూ దండాడింపు, వసంతోత్సవం ఆహ్లాదంగా జరిగాయి. తదుపరి సప్తగోదావరి నదిలో త్రిశూల, శ్రీచక్రస్నానం అర్చకస్వాములు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు త్రిశూల, శ్రీచక్ర స్నానం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకదుర్గాప్రసాద్, అర్చకులు, సిబ్బంది, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సారె సమర్పణ: భీమేశ్వర పారాయణం చేస్తున్న మహిళలు మాణిక్యాంబ అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు , చీర, రవికె సమర్పించారు.


నృత్యం చేస్తున్న అర్చక స్వాములు

చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ వారాంతపు ప్రత్యేక రైళ్లు

విజయవాడ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నస్రత్ మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీని నియంత్రించేందుకు ఈ రైళ్లను ఈనెల 23వ తేదీ వరకు నడుపుతున్నట్లు తెలిపారు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి కాకినాడ టౌన్‌కు ఉదయం 4.30 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీలలో నడుస్తుంది. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు కాకినాడలో సాయంత్రం 6.55కు బయలుదేరుతుంది. చర్లపల్లికి ఉదయం 6.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 16, 23 తేదీలలో నడుస్తుంది. 07233 చర్లపల్లి - నరసాపూర్ రైలు రాత్రి 7.15కు చర్లపల్లిలో బయలుదేరి నరసాపూర్‌కు ఉదయం 5.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీలలో నడుస్తుంది. 07234 నరసాపూర్ - చర్లపల్లి రైలు నరసాపూర్‌లో రాత్రి 8 గంటలకు బయలుదేరి చర్లపల్లికి ఉదయం 8 గంటలకు చేరుతుంది. చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. దీనికి టూఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండతరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు. చర్లపల్లి - నరసాపూర్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండవరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు.







తొండంగి సముద్రతీరంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మాఘపౌర్ణమి స్నానాలకు
పోటెత్తిన భక్తులు

- సముద్రునికి హారతులు
- ఉప్పాడ, తొండంగి తీరాల్లో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు



ఉప్పాడ రేవులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు.. ఇన్‌సెట్‌లో సముద్రుడికి నమస్కరిస్తున్న మహిళ

కొత్తపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమి సందర్భంగా బుధవారం కాకినాడ జిల్లా ఉప్పాడ రేవులోను, తొండంగి తీరంలోను పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. కరోనా తర్వాత మాఘపౌర్ణమిలో వేలాదిమంది భక్తులు స్నానాలు ఆచరించడం విశేషం. పిఠాపురంనుంచి శ్రీ కుంతీ మాధవస్వామి(దొంగదేముడు) బుధవారం తెల్లవారుజామున వేదపండితులు పల్లకిలో ఊరేగించుకుంటూ కొత్తపల్లి మండలం ఉప్పాడ రేవుకు తీసుకొచ్చి చక్రస్నానం చేయించారు. స్వామివారి చక్రస్నానం అనంతరం పిఠాపురం, కత్తిపూడి, శంఖవరం, తుని, కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఉప్పాడ రేవులో సముద్ర స్నానాలు చేసి ఒడ్డునే ఉన్న శ్రీకుంతీ మాధవస్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నాయకర్ కాలనీలో గంగాలమ్మతల్లి జాతరలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు కానుకలు సమర్పించారు. తెల్లవారుజాము 4గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉప్పాడరేవులో భక్తులు స్నానాలు ఆచరించడం విశేషం.



పౌర్ణమి పర్వదినాన రత్నగిరిపై రద్దీ

అన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం సత్యదేవుని సన్నిధికి భక్తులకు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి 2గంటల సమయం పట్టింది. 40వేల మంది స్వామిని దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.35లక్షల ఆదాయం లభించింది.

తొలిరోజు ఉపసంహరణలు నిల్

- నేటితో ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణల గడువు ముగింపు

ఏలూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లను తొలి రోజు బుధవారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. దీంతో ప్రస్తుతానికి 43మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈనెల 13వ తేదీ గురువారంతో ముగియనుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక బరిలో నిలిచిన అభ్యర్థులకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి గుర్తులను కేటాయించనున్నారు. పరిశీలనలో 11మంది నామినేషన్లు సక్రమంగా లేకపోవడంతో వాటిని తిరస్కరించిన విషయం తెలిసిందే.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో నిందితుడికి రిమాండ్

కరప,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన ఆటో డ్రైవర్‌ను అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరుపరచగా నిందితుడికి మెజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కేదాసి సూరిబాబును అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మేడపాటి శ్రీనివాసరావు ఈనెల 9న వేళంగి-జి.బావారం రోడ్డులో వైన్‌షాప్ దగ్గర కత్తితో విచక్షణంగా దాడి చేశాడు. నిందితుడిని మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని ఎస్‌ఐ చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో గడ్డి మందు తాగి ఇద్దరి మృతి

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వివిధ కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై గడ్డి మందు సేవించి తీవ్ర అస్వస్థతకు గురై కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఆర్ జిల్లా గంగవరం మండలం జగ్గంపాలేనికి చెందిన వి.వీరప్రసాద్ (27) వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆ యువకుడిని గమనించిన కుటుంబీకులు తొలుత గోకవరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామానికి చెందిన వల్లు ఏసుబాబు(54) వేరేవారి గేదె తన వల్లే చనిపోయిందని ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఏసుబాబు గేదెను చెందిన వారికి నష్టపరిహారంగా రూ.25వేలు ఇవ్వాలని స్థానిక పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఏసుబాబు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబీకులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాకీ టోర్నమెంట్‌కు రానున్న 40 టీంలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరిగే 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో 18 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలు, 11 ప్రాంతీయ క్రీడా మండళ్ల నుంచి 40 టీంలు పాల్గొంటున్నాయని టోర్నమెంట్ చీఫ్ కోఆర్డినేటర్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఇందులో 33 పురుషుల టీములు, 7 మహిళల టీములు పోటీపడనున్నాయన్నారు. మొత్తం 538మంది పురుష క్రీడాకారులు, 205 మంది మహిళా క్రీడాకారులు, వారితోపాటు 70మంది కోచ్‌లు, మేనేజర్లు ఈవెంట్‌లో పాల్గొంటున్నారన్నారు. హరాన్యా, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. వీరందరికీ అవసరమైన వసతి, రవాణా, ఆహార ఏర్పాట్లను చేపట్టామని తెలిపారు.

తుని బాలుడి కిడ్నాప్ కేసులో..
పాఠశాల పీఈటీయే నిందితుడు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

- మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కిడ్నాప్‌నకు పథకం
- ఈజీ మనీ కోసమే చేశారని వెల్లడించిన పోలీసులు

తుని రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తునిలో సోమవారం సంచలనం సృష్టించిన బాలుడి కిడ్నాప్ ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ పాఠశాలలో పీఈటీయే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ కిడ్నాప్‌కు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఈనెల 10న తుని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్న ఒకటో తరగతి విద్యార్థి కిడ్నాప్ కలకలం రేపింది. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో పోలీసులకు దొరికిపోతామన్న భయంతో కిడ్నాపర్లు వెనుకంజ వేశారు. బాలుడిని ఆటోలో ఇంటికి పంపించేస్తున్నట్లు తండ్రికి ఫోన్‌చేసి చెప్పారు. దీంతో ఆ బాలుడు తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా చేరాడు. అనంతరం కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో బాలుడి కిడ్నాప్‌కు పాల్పడ్డ ముగ్గురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. వీరినుంచి ఒక కారు, ద్విచక్రవాహనంతో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనపరుచుకున్నారు. తుని డీఎస్పీ శ్రీహరిరాజు కేసు వివరాలను వెల్లడించారు. తునిలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ ఉపాధ్యాయుడు ఎం.రాజీవ్‌తో కలిసి రౌతులపూడి మండలం లచ్చిరెడ్డి గ్రామానికి చెందిన చందవాడ కాశీవుడు, ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన సురకాసుల రాముడు పథకం ప్రకారమే బాలుడ్ని కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ఈ పనికి పాల్పడ్డారని, నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచనున్నామని చెప్పారు. సమావేశంలో తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ, ఎస్‌ఐ విజయ్‌బాబు, తుని పీఎస్ ఏఎస్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

రామ్ పోతినేని సినిమా షూటింగ్

- కొవ్వూరులో చిత్రీకరణ



కొవ్వూరు లాంచీలరేవు వద్ద రావురమేష్‌పై సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మైత్రి మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న హీరో రామ్ పోతినేని సినిమా చిత్రీకరణ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం జరిగింది. కొవ్వూరు పట్టణంలోని లాంచీలరేవు వద్ద గోదావరి ఏటిగట్టు రోడ్‌పై రావు రమేష్ సైకిల్‌పై తన కొడుకును ఎక్కించుకుని వెళ్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా రామ్ పోతినేని, హీరోయిన్‌గా మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే, ప్రధాన తారాగణం రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్ నటిస్తున్నారు. సంగీతం వివేక్ మార్విన్ అందజేస్తున్నారు. మరో 40రోజులపాటు గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుగుతుందని దర్శకుడు మహేష్‌బాబు, ప్రొడక్షన్ డిపార్ట్‌మెంటు సభ్యులు తెలిపారు. సినిమా షూటింగ్ కారణంగా రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా ఏలూరు వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

పీడీఎఫ్, యూటీఎఫ్‌లపై హర్షకుమార్ వ్యాఖ్యలు సరికాదు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

- అభ్యర్థులందరి సమక్షంలోనే రాఘవులు నామినేషన్ ఆమోదం
- ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీడీఎఫ్, యుటీఎఫ్‌లను విమర్శిస్తూ మాజీ ఎంపీ హర్షకుమార్ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ఖండించారు. కాకినాడలోని యుటీఎఫ్ హోంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐవీ మాట్లాడుతూ పీడీఎఫ్ ఎల్లప్పుడూ ప్రజాపక్షమేనన్నారు. పీడీఎఫ్, యూటీఎఫ్ అధికార కూటమికి అమ్ముడుపోయాయని ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ఆయన స్థాయికి తగదన్నారు. నామినేషన్ ప్రక్రియ ఎన్నికల నిబంధనల ప్రకారమే జరిగిందని, ఇతర అభ్యర్థుల సమక్షంలోనే డీవీ రాఘవులు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆమోదించారని తెలిపారు. పీడీఎఫ్ కులపరమైన అభ్యర్థుల ఎంపిక గానీ, కులపరంగా ఓట్లు అభ్యర్థించడంగానీ చేయదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల్లో పీడీఎఫ్ ప్రచారం చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల ఉద్యమాల్లో రాఘవులు భాగస్వాములు అయ్యారన్నారు. హర్షకుమార్ తన అభ్యర్థి గుణగణాలు, అర్హతలు ప్రజలకు చెప్పి ఓట్లు అడిగితే బాగుంటుందన్నారు. పీడీఎఫ్ అభ్యర్థిపై హర్షకుమార్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఐవీ హితవు పలికారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో రాజకీయం

- సామాజికవర్గ ఓట్లు చీల్చేందుకు ప్రయత్నం
- మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేసిన నామినేషన్ల ప్రక్రియలో భారీ రాజకీయం జరిగిందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ల స్క్రూటినీ పద్ధతిలో తొలుత పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవరావు డిస్ క్వాలిఫై అయ్యారని ప్రకటించారని, చివరిలో క్వాలిఫై అయినట్లు లిస్ట్‌లో ప్రకటించారని తెలిపారు. పీడీఎఫ్ అభ్యర్థి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారని తాను కూడా స్వాగతించానని, డిస్ క్వాలిఫై చేసి మళ్లీ క్వాలిఫై చేయడాన్ని బట్టి కుమ్మక్కైనట్లుగా అర్థమవుతోందన్నారు. ఇదంతా పోటీలో ఉన్న తన కుమారుడు జీవీ సుందర్‌కి, వీరరాఘవరావుకు మధ్య ఓట్లు చీల్చడం కోసమే చేశారని ఆరోపించారు.

'వ్యవస్థలతో కుటిల రాజకీయాలు'

తుని రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయాలు చేస్తోందని మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపించారు. తునిపట్టణంతోపాటు గ్రామీణప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలిసి మేనిఫెస్టో వివరించారు. అనంతరం తునిలో మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ల సందర్భంగా జరిగిన విషయాన్ని వివరించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సుందర్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దారా సురేష్, తంతటి కిరణ్‌కుమార్, దళిత నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలిగా సునీత

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలిగా కె.సునీత నియమితులయ్యారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ, ప్రిన్సిపల్ సెక్రటరీగా ఈమె పనిచేస్తున్నారు. మరో రెండురోజుల్లో ఈమె కాకినాడ జిల్లాకు రానున్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించనున్నారు.

సత్యసూర్య బ్యాంకర్స్‌వద్ద ఖాతాదారుల గగ్గోలు



ఆందోళన చేస్తున్న బాధిత ఖాతాదారులు

కొత్తపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు హేమంత్ కార్యకలాపాలు నిర్వహించకుండా పరారైన నేపథ్యంలో అక్కడ బంగారం తాకట్టు పెట్టిన బాధితులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తమ బంగారం తమకు ఇప్పించాలంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నిర్వాహకుడు హేమంత్ కుటుంబసభ్యులతో సహా పరారై పదిరోజులైందని, తమకు సమాధానం చెప్పాలంటూ లైసెన్సుదారుడైన శ్రీహూకోళ్లపు రామకృష్ణను, అతని తండ్రి సత్యనారాయణను నిలదీశారు. బాధితులందరికీ తగిన న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన మెర్లపాలెం విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెం జడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఈతకోట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలో మెర్లపాలెం విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారు. అండర్-19 జూనియర్ బాలుర విభాగంలో ముగ్గురు విద్యార్థులు, జూనియర్ బాలికల విభాగంలో నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ శ్రీకాంత్ తెలిపారు. వీరిని సర్పంచ్ మెర్ల రాము, హెచ్‌ఎం శ్రీహరి, చైర్మన్ లక్ష్మీనారాయణ అభినందించారు.

అనుమతులు లేని 8 ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొత్తపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట శివారు కపిలేశ్వరపురం మండలం కేదార్లంక ఇసుక రీచ్ నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మైన్స్ ఆర్‌ఐ సుజాత తన సిబ్బందితో వెళ్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా తరలిపోతున్న 8 ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసి కొత్తపేట పోలీసులకు అప్పగించారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం నెల్లూరుకు చెందిన బాలకృష్ణారెడ్డి-శైలజ దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాత దంపతులను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



వై.సుభ శ్రీవల్లీ ఆత్రేయి



పి.ఆదిత్య అభిషేక్

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరచి అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించినట్లు చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. వై.సుభ శ్రీవల్లీ ఆత్రేయి, పి.ఆదిత్య అభిషేక్ 99.97 పర్సంటైల్ సాధించారని, జీఎస్‌ఆర్ శశాంక్ 99.96, టి.సాత్విక్, జి.ఇనేష్ 99.94 పర్సంటైల్‌ను సాధించారని, వీరితోపాటు మరో 47మంది ఆదిత్య విద్యార్థులు 99.00 పైన పర్సంటైల్ పొందారని తెలిపారు. వై.వెజిత్ 99.93, వైపీవీఎస్ చక్రపవన్ 99.92, ఎంజే చంద్ర, కేపీసాయి, జి.లోసిని 99.91 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచి అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ అభినందించారు.

డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాలకోసం కాటన్ బ్యారేజ్‌నుంచి డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కుల నీరు విడుదలచేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1800క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4400 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. నదిలో నీటిలభ్యత 8309క్యూసెక్కులుండగా నీటి మట్టం 9.60 అడుగులుగా నమోదైంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని
మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకకు వచ్చిన ఓ మహిళ విగతజీవిగా ఇంటికి చేరింది. బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథం తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన భీమడోలు మనోహర్ తన భార్య దయామణి(45)తో కలిసి స్థానికంగా ఏవీ అప్పారావు రోడ్డులో బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చారు. సాయంత్రం 5గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. తాడితోట గోకుల్ టీవీఎస్ వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు ముందు టైరు ఎక్కేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'లోవ'లో హుండీ లెక్కింపు

- రూ.39.31లక్షల ఆదాయం



తలుపులమ్మ లోవ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో హుండీలు లెక్కింపు బుధవారం నిర్వహించారు.కాకినాడ గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ అధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హుండీలు తెరిచి లెక్కించగా 66రోజులకుగాను రూ.39.91లక్షలు నగదుతో పాటు రూ.30.121 గ్రాముల బంగారం, 1.355 కిలోల వెండి ఆలయానికి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొనగా దేవదాయశాఖ తనిఖీదారులు బి.ఫణీంద్ర కుమార్‌తో కలిసి ఆలయ ఈవో విశ్వనాధరాజు పర్యవేక్షించారు.

బి.ప్రత్తిపాడులో 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్‌బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పిఠాపురంరూరల్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో రేషన్‌బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో బుధవారంరాత్రి పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ తనిఖీలు నిర్వహించారు. రేకులషెడ్డులో నిల్వఉన్న 30క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆకుల గంగరాజుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

చండీ సూర్యారాధన కార్యక్రమం

రాజమహేంద్రవరంకల్చరల్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మాఘమాసాన్ని పురస్కరించుకుని కొంతమూరు పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పద్మాక్షీనగర్‌లో వడలి కుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శత చండీ సూర్యారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం సామూహిక సూర్య కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

డీపీవోలో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పోలీసులు సిబ్బంది

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ నరసింహకిషోర్ పర్యవేక్షణలో జీఎస్‌ఎల్ ఆస్పత్రి సౌజన్యంతో పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 200మంది పోలీసులకు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేశారు. దీనికోసం జీఎస్‌ఎల్ నుంచి క్యాన్సర్ వైద్య పరీక్షల ప్రత్యేక వాహనాన్ని తీసుకొచ్చారు. క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులపై పూర్తిగా దృష్టి సారించ డానికి సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే జీవితంలో ఏదిసాధించడమైనా కష్టమవుతుందని చెప్పారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య భద్రత కల్పించడంలో భాగంగా ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వైద్యులతో తగు సలహాలు, సూచనలు ఇప్పిస్తున్నామని ఎస్పీ వివరించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీ కృష్ణ, పోలీస్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు రఘురాం పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు


బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బహిరంగప్రదేశాలు, వైన్‌షాపులవద్ద మద్యం సేవించడం నేరమని అటు వంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ హెచ్చరించారు. ఈమేరకు గ్రామంలోని నిర్మానుష ప్రదేశాలతోపాటు, మద్యం షాపులవద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించే వారిపై కఠినచర్యలు చేపడతామని మత్తు పదార్థాలు కలిగిఉండటం, సేవించడం నేరమని హెచ్చరించారు.

రేపు మాజీ సీఎం సంజీవయ్య జయంతి

• టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఈనెల 14న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర కన్వీనర్ కాశి నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి కోసం కష్టపడిన దామోదరం సంజీవయ్య సేవలను తమ నాయకుడు సీఎం చంద్రబాబు గుర్తించారని ఆ మహనీయుడు సంజీవయ్య జయంతిని ఆయన స్వస్థలమైన కర్నూల్ జిల్లాలో రూ.5లక్షలతో ప్రత్యేకంగా ఉత్సవాలు నిర్వహించాలని, మిగిలిన జిల్లాలకు రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ఘనంగా శారదాదేవి 34వ తీర్థ మహోత్సవం



కడియం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం దుళ్ల గ్రామంలో మార్కెట్ సెంటర్‌లో ఉన్న శ్రీశారదాదేవి 34వ తీర్థ మహోత్సవాలు మాఘపౌర్ణమి పురస్కరించుకుని బుధవారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేకపూజలు, పసుపు కుంకుమ పూజలు నిర్వహించారు. తీర్థమహోత్సవం పురస్కరించుకుని ఆలయంవద్ద భారీ బాణాసంచాకాల్చారు. కార్యక్రమంలో దేవీ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో రాజమహేంద్రవరానికి

ఉత్తమ ర్యాంక్ సాధించాలి

● కమిషనర్ కేతన్ గార్గ్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాజమహేంద్రవరానికి ఉత్తమ ర్యాంక్ సాధించాలని నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌కార్గ్ అన్నా రు. రాజమహేంద్రవరం ఆనంకళాకేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పై కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాలు సక్రమంగా నిర్వహించి ఉత్తమ ర్యాంక్ సాధించేలా కృషి చేయాలన్నారు. నగరంలో ఉన్న 50 డివిజన్లలో 137 లోకేషన్లలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు మదింపు జరుగుతుందని, 100శాతం చెత్తసేకరణ, 100 శాతం తడి, పొడి చెత్త విడదీసే కార్యక్ర మం జరిగేలా చూడాలన్నారు. గార్బేజ్‌వల్ల రబుల్ పాయింట్స్‌ను పరిశుభ్రత ప్రదేశంగా మార్చు చేయాలని, ఎమినిటీస్ కార్యదర్శి, శానిటేషన్ కార్యదర్శి సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సమిష్టి కృషిచేయాలని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ సొంత పనిగా భావించాలన్నారు. ర్యాంకు మదింపులోభాగంగా ప్రధాన రహదారులలో వాటి వెనుక నున్న సందులు కూడా పరిశీలిస్తారని అక్కడ కూడా చెత్త లేకుండా చూడాలని ఆదేశించారు. ఇంటింటా చెత్తసేకరణ చాలా ముఖ్యమైన కార్యక్రమమని అందుకు దృష్టి పెట్టాలన్నారు. ఇంటింట సర్వేచేసి ప్రతిరోజు కొంత మందిని కలిసి వారివద్ద నుంచి వివిధ సమాచారం సేకరించాలని, పారిశుధ్యం మెరుగుపరచ డానికి సూచనలు చేస్తే వాటిని స్వీకరించాలన్నారు. కాలువలలో ఉన్న చెత్త తొలగించడంపై మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, కాలువలలో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని రాబోయే మూడు రోజులు కాలువలు శుభ్రం చేయడం మీదే పనిచేయాలన్నారు. తినుబండారాలను అమ్మేషాపులు, చిన్నపెద్ద హోట ళ్లు, కాంటీను వాడిన కప్పులు, పొట్లాలు రోడ్లమీ ద వదిలేస్తున్నారని అలాంటి వారిని హెచ్చరికలతో వదిలేయకుండా జరిమానాలు వేయాలని అప్పుడే వారు ఎటువంటి పొరపాట్లు చేయకుండా ఉంటారని అన్నారు. నగరంలో ఉన్న 24 కమ్యూనిటీ, 30 పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, బహిరంగ మలమూత్ర విసర్జన ఎక్కడైనా జరుగుతుందేమో పరిశీలించాలని తెలిపారు. ఎక్కడ దుమ్ములేని గాలిలో కలిసే అవకాశమున్న రోడ్లను నీటితో తడపాలని, కొత్తగా కొనుగోలు చేసిన నీటి బిందువులు విరజిమ్మే వాహనాన్ని వినియోగించి వాయు కాలుష్యం తగ్గేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎస్‌ఈ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, సెక్రటరీ శైలజవల్లి, మేనేజర్ ఎండీ అబ్దుల్‌మాలిక్ అస్సర్, శానిటరీ సూపర్‌వైజరు శ్రీనివాస్, డివిజన్ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికలలో పట్టంకట్టండి

● ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ప్రచారం


నన్నయలో ప్రచారం నిర్వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న శాసనమండలి ఎన్నికలలో పోటీచేస్తున్న తనకు ఓటువేసి గెలిపించాలని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిపేరాబత్తుల రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోనూ, ప్రాంగణంలోని కళాశాలలలోని బోధన బోధనేతర ఉద్యోగులను పేరాబత్తుల బుధవారం కలసి ఓట్లు అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వ విజయాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన వెంట ట్రైబల్ రైట్స్ ఫోరం (టీఆర్‌ఎఫ్) వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ఆర్.ఎస్.వరహాలదొర ఉన్నారు.

పేరాబత్తులను గెలిపించండి: ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటువేసి గెలిపించాలని ఓటర్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభ్యర్థించారు. రాజమహేంద్రవరం 29, 30 డివిజన్లలో బుధవారం నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణితో కలిసి ఎన్నికల ప్రచారాం చేశారు. పట్టభద్రులైన ఓటర్లను కలిసి కరపత్రాలు అందించారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రంలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేసుకుంటూ వస్తున్నారని చెప్పారు.

కూటమి అభ్యర్థికి ఓటు వేయండి

-ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పట్టభద్రులను కోరారు. బుధవారం ఆయన బలభద్రపురంలోని పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి రాజశేఖరాన్ని గెలిపించాలని కోరి కరపత్రాలను అందజేశారు. ఈయన వెంట దేశం నేత నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.


పేరాబత్తులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రంగంపేట: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం రంగంపేట మండలం ఈలకొలను, జి.దొంతమూరు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి, పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈయన వెంట అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు చింతల రామకృష్ణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, కొమ్మరి రాంబాబు, ఉద్దండ్రావు శ్రీను, సాయిబాబు రంగంపేట మండల,ఈలకొలను, జి.దొంతమూరు గ్రామాల ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

విజయానికి కృషిచేయాలి

-డాక్టర్ రవిరామ్‌కిరణ్


వేమగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ గోరంట్ల

కడియం: కడియం మండలం వేమగిరిలో బుధవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, చెల్లుబోయిన శ్రీను, గుత్తుల కృష్ణ కూటమి నాయకులతో కలిసి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇంటికి వెళ్లి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వాసంశెట్టి నాగబాబు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, దంగేటి శ్రావణ్‌కుమార్, బొల్లాడి జాన్‌బాబు, కోలా శ్రీను, సుంకర గోపాలకృష్ణ ఉన్నారు.

● పొట్టిలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ఘనంగాజరిగింది. వేమగిరిలో సత్తెమ్మ తల్లి ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. పొట్టిలంక సుబ్రహ్మణ్యస్వామిని, వేమగిరి సత్తెమ్మతల్లిని టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్ కిరణ్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని,తదితరులు దర్శించుకున్నారు.

రాజశేఖర్ గెలుపునకు కృషి చేయండి

అనపర్తి: కూటమి అభ్యర్థిగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించడం ద్వారా కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని గోదావరి తూర్పుడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అనపర్తి, దుప్పలపూడి గ్రామాల్లో ఆయన కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ చింతల రామకృష్ణ, నల్లమిల్లి వెంకటరెడ్డి, చిర్ల గంగిరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, వేగిరెడ్డి రాధ, కర్రి బులిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నది ఒడ్డున పూజలు చేస్తున్న అర్చకులు, చక్రస్నానం చేస్తున్న భక్తులు

వైభవంగా స్వామివారి చక్రస్నానం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూ నీశా సమేత లక్ష్మీజనార్దనస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులతో పాటు చక్రల్వార్లు, పల్లకిలో ఆశీనులు చేసి సన్నాయి వాయిద్యాల మధ్య రామపాదాల స్నానఘాట్‌కు తీసుకెళ్లారు. ఆలయ అర్చకులు ఎస్వీఎస్ ఎన్ ఆచార్యులు అర్చకత్వంలో నదిఒడ్డున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని చక్రస్నానం ఆచరించారు. మధ్యాహ్నం స్వర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించి ముత్యాల పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు.

బాలికల వసతిగృహం పరిశీలన


కడియం బాలికల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సీఐ వేంకటేశ్వరరావు

కడియం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కడియం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని బుధవారం సీఐ ఎ.వేంకటేశ్వరరావు సందర్శించారు. బాలికల హాస్టల్‌లోని గదులు, వంటశాల, రక్షణగోడ, టాయిలెట్స్, కిటికీలు, వంటి వాటిని పరిశీలించారు. వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. అవసరమైనచోట్ల సీసీ కేమేరాలు ఏర్పాటు చేసేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చుక్కల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి


బిక్కవోలులో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవిచంద్రకుమార్

బిక్కవోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితం సర్వనాశనమవుతుందని బిక్కవోలు ఎస్‌ఐ వి.రవి చంద్రకుమార్ సూచించారు. స్థానిక ప్రజా కళాశాలలో బుధవారం ఆయన మత్తు పదార్థాలు వాటివల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీను, పిన్సిపాల్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న విష్ణు సహస్రనామ పారాయణం

రాజమహేంద్రవరం, కల్చరల్ ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ సమాజంలో ఈనెల 23న సనాతన ధర్మ వారధి ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణాలు సామూహికంగా జరుగుతాయని సంధానకర్తలు మిర్తిపాటి వెంకట్రామయ్య, చిట్లా ప్రగడ రాధాకృష్ణలు తెలిపారు. ఈ ఆహ్వానపత్రికను నగర ప్రముఖులు న్యాపతి సుబ్బారావు, ఆధ్యాత్మికవేత్త మంచిరాజు హేమలతలు ఆవిష్కరించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, పెదమల్లు వాగ్దేవి, గుడిపూడి గౌతమ్, హరే శ్రీనివాసా భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. భాస్కర్‌నగర్‌కి చెందిన ఎం.వెంకటేశ్ ఆర్టీవో ఆఫీస్ సమీపంలో ఆటోలో టిఫిన్ బండి నడుపుతున్నాడు. అయితే అక్కడే పనిచేసే మహిళతో తన భర్తకు సంబంధం ఉందనే ఉద్దేశంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెంకటేశ్ ఈనెల 10న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

సారా స్థావరాలపై దాడి

30లీటర్ల సారా స్వాధీనం, ఒకరి అరెస్ట్

రంగంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోగల రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామంలో నాటుసారా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించి పెద్ద దొడ్డిగుంట గ్రామానికి చెందిన చెల్లిబోయిన వీరబాబును అరెస్టుచేసి అతని వద్ద నుంచి 30లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకుని వీరబాబుని రిమాండ్‌కి పంపించామని ఎక్సైజ్ సీ.ఐ సుధ తెలిపారు. ఈ దాడులలో ఎస్.ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారని సీఐ తెలిపారు

ప్రతి రైతుకు విశిష్ట ఆధార్ ఉండాలి

● ఏవో శామ్యూల్‌జాన్

బిక్కవోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే విశిష్ట ఆధార్ సంఖ్యను కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి శామ్యూల్‌జాన్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన బిక్కవోలులోని రైతు సేవా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని పూర్తిగా ఆధునీకరించడం కోసం ఆధార్ నెంబరువలే రైతులకు 14 అంకెల ఈ విశిష్ట ఆధార్ నెంబరును జారీ చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే రైతులు ఈనెంబరును పొందాలన్నారు. సొంత భూమిగల రైతులు, కౌలు రౌతులందరూ గ్రామంలోని రైతుసేవా కేంద్రానికివెళ్లి విశిష్ట ఆధార్‌ను, ఈక్రాప్‌ను చేయించుకోవాలన్నారు. మండలంలో 8వేలకు పైగా రైతులు ఉన్నారని, 626 మంది రైతులు ఈ విశిష్ట ఆధార్‌ను పొందారని ఏవో వివరించారు.


బిక్కవోలు రైతు సేవాకేంద్రంలో రైతుల విశిష్ట ఆధార్ సంఖ్యల నమోదును పరిశీలిస్తున్న ఏవో శామ్యూల్‌జాన్

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాజానగరం, కడియం, రాజమహేంద్రవరంరూరల్ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు సాంకేతిక అంశాలపై పథక సంచాలకులు నాగమహేశ్వరరావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెరువులు, కాలువలు, ఫార్మాపాండ్స్, చేపల చెరువులు, కొలతలు ప్రకారం ఉపాధి కూలీలతో పనిచేయించేందుకు వారికి దినసరి వేతనం రూ.300 వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లకు రిఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ రామ్‌ప్రసాద్, ఏపీవో బీవీ సత్యవతి, డీఆర్‌పీలు వైబీఎన్ రాజేష్, చక్రవర్తి పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పథక సంచాలకుడు నాగమహేశ్వరరావు

నేడు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఈనెల 13వ తేదీ గురువారం రాజమహేంద్రవరం సిటీలో కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్లతో భారీ ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని జిల్లా రవాణా అధికారి (డీటీవో) ఆర్.సురేష్ తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ ముఖ్యఅతిథులుగా ఈ ర్యాలీ ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు. వాహనదారులు అందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నుంచి సరఫరా అయ్యే అన్ని 11 కేవీ ఫీడర్లుకు రేపు శుక్రవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆపరేషన్ దాట్ల శ్రీధరవర్మ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ వార్షిక మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తామన్నారు. దివాన్ చెరువు, శ్రీరాంపురం, పాలచర్ల గ్రామాలకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు అందరూ తమశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

19న జిల్లా గిరిజన ఉద్యోగుల సమావేశం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా గిరిజన ఉద్యోగుల సమీక్షా సమావేశం ఈనెల 19న రాజమహేంద్రవరంలో జరుగుతుందని జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.వరహాలదొర తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జాతీయ గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.వి.రమణ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆరోజు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంను ఆయన సందర్శించి ఉపకులపతితో సమావేశమై గిరిజన ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఏపీ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జాని



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏబీ జనార్థన్‌రావు (జాని) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులో జరిగిన ఏపీ న్యాయశాఖ ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో తూర్పుగోదావరిజిల్లా రాజమండ్రి నుంచి పోటీలో ఉన్న జానిని రాష్ట్ర కార్యవర్గంలోని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సంఘం తెలిపింది. జాని మాట్లాడుతూ న్యాయశాఖ ఉద్యోగుల సమస్యలపై పోరాడతానన్నారు. ఈ సందర్భంగా రాజమండ్రి న్యాయశాఖ ఉద్యోగులు పలువురు జానికి అభినందనలు తెలిపారు.

మానవ హక్కుల ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా అనుయాదవ్

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా అనుయాదవ్‌ను నియమించినట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాస్ తెలిపారు. ఈమేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నియామక పత్రాన్ని అనుయాదవ్‌కు అందించారు. మానవహక్కులు, వినియోగదారుల చట్టం, మానవ అక్రమ రవాణా, బాలికలపై వేధింపులు తదితర అంశాలపై బాధితులపక్షాన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రతినిధులు ఎస్. ఝాన్సీ, యెనుముల రుక్మిణి, చిన్నయేసు పాల్గొన్నారు.





భక్తజన సంద్రం!

అంతర్వేది భక్తజన సంద్రమైంది.. స్వామిని కన్నులారా చూసేందుకు.. స్వామి వెంట నడిచేందుకు బుధవారం వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. స్వామి వెంట నడిచారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీ లక్ష్మీనర సింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్ర స్నానం నిర్వహించారు. గరుడ పుష్పక వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకీ లో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళ, కేరళ వాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. స్వామితో కలిసి పుణ్యస్నానం ఆచరించారు



గాజుల అలంకరణలో అమ్మవారు

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆల యంలో మాఘ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజ లు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుందర గణేష్ ఆ ధ్వర్యంలో బుధవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పౌర్ణమి ని పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల మట్టి గాజులతో అలంకరించి పూజలు చే శారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరి సర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



పులి..చిక్కేనా!

పులుల కేరాఫ్ పాపికొండలు

అసలు ఉభయగోదావరి జిల్లాల్లో పులులు ఎన్ని ఉన్నాయి..? పులులా అవెక్కడుంటాయి..! మన జిల్లాల్లో అసలు పులులు లేవనేది చాలామంది వాదన. ఇది నిజం కాదు.. మన జిల్లాల్లోనూ పులులు ఉన్నాయి.. ఎక్కడో తెలుసా పాపికొండల అభయారణ్యంలో.. ఆ లెక్క ఎలా అంటారా.. నాలుగేళ్లకోసారి పులుల గణన చేపడతారు.. ఉభయగోదావరి జిల్లాల్లో 2022లో చేపట్టారు.. ఒక్క రోజు రెండు రోజులు కాదండోయ్ ఏకంగా 90 రోజులపాటు లెక్కించారు.. నాడు అభయారణ్యంలో ఆరు చిరుతలు.. నాలుగు పెద్ద పులులు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి.. వచ్చే ఏడాది మళ్లీ పులుల గణన చేపట్టనున్నారు.. ఎందుకంటే గతేడాది ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అడపాదడపా జనారణ్యంలోకి పులులు వచ్చిన ఘటనలు ఉన్నాయి.. దీనిలో భాగంగా ఇప్పటినుంచే అధికారులు సన్నద్ధమవుతున్నారు.. అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో గోదావరికి ఇరువైపులా విస్తరించి ఉన్న పాపికొండల అభ యారణ్యంలో పులుల సంఖ్యను లెక్కించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది మే నుంచి సర్వే చేపట్టాల్సి ఉండడంతో సన్నద్ధమవుతున్నారు. ఏటా నాలుగేళ్లకోసారి జా తీయ పులుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆదేశాల మేరకు అటవీశాఖ పాపికొండల్లో 90 రోజుల పాటు పులుల లెక్కింపు నిర్వహిస్తుంది. చివరిగా 2022లో సర్వే జరిగింది. నాలుగేళ్లు పూర్తవడంతో వచ్చే ఏడాది మేలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నారు. గతంతో పోల్చితే ఈసారి పాపికొండల్లో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పాపికొండలే ఆవాసం..

పులులు,చిరుత పులులకు పాపికొండల అభ యారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 2.60 లక్షల ఎకరాల్లో పాపికొండలు విస్తరించి ఉన్నా యి. దూరంలో చెప్పాలంటే మొత్తం 391 చద రపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్నాయి. పాపికొండల మధ్యలో గోదావరి నది ఉంది. అందుకే పులుల రక్షణ ప్రాంతంగా పాపికొండలు ప్రసిద్ధి చెందా యి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో ఇక్కడ అనేక రకాల పక్షులు, జంతువులు సంచరిస్తుం టాయి. దీంతో ఆహారం, నీటికి ఏ మాత్రం పులు లకు ఢోకా ఉండదు. ఈనేపథ్యంలో పులుల ఆవాస ప్రాంతంగా ప్రసిద్ధి కెక్కింది.

చివరిగా 2022లో సర్వే

పాపికొండల్లో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నా యి? అనే దానిపై రాజమహేంద్రవరం అటవీ శాఖ అధికారులు రంపచోడవరం, కాకినాడ అటవీ శాఖల సాయంతో నాలుగేళ్లకోసారి పులుల లెక్కింపు చేపడతాయి. చివరిగా పాపి కొండల్లో 2022లో పులుల లెక్కింపు జరిగింది. అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరి ధిలో విస్తరించి ఉన్న పాపికొండల అభయా రణ్యం పరిధిలో 45 రోజులు, ఉమ్మడి పశ్చి మగోదావరి జిల్లా అభయారణ్యం పరిధిలో 45 రోజులపాటు సర్వే చేశారు. రెండు దశల్లో కలిపి అభయారణ్యంలోని 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పులుల సంఖ్య లెక్కించారు. నాలుగు పెద్దపులులు, ఆరు చిరుత పులులు గుర్తించారు. అయితే ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచ నా వేశారు. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోను పులులకంటే చిరుతల సంచా రం అధికంగా ఉందని నిర్ధారించారు. 2018లో నిర్వహించిన సర్వేలో అసలు ట్రాప్ కెమెరా లకు పులులు, చిరుతలు చిక్కలేదు. దీంతో ఆ ఏడాది సర్వే వివరాలు బయటపెట్టలేదు.

- వచ్చే ఏడాదే పులుల గణన
- మే నెలలో లెక్కింపు
- 200కిపైగా సీసీ కెమెరాలు
- శ్రీశైలం నుంచీ నిపుణులు
- పులులు పెరిగే అవకాశం
- 12 ఉండొచ్చని అంచనా
- చివరిగా 2022లో సర్వే
- 6 చిరుతలు,4 పులులు గుర్తింపు
- 90 రోజుల పాటు సర్వే
- రంగంలోకి ఎన్‌టీసీఏ

ఈసారి పెరగడం ఖాయమే..

వచ్చే ఏడాది మేలో చేపట్టనున్న సర్వేకు సంబంధించి త్వరలో సన్నాహాలు ప్రారంభించ డానికి అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి మరింత పగడ్బందీగా పులుల లెక్క తేల్చాలని భావిస్తోంది.ఈ మేరకు అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. వాస్తవానికి పలుసార్లు సర్వే కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పా టు చేస్తున్నా అవి చిక్కడం లేదు. దీనివల్ల వాస్తవ సంఖ్య తేలడం లేదు. మే నెలలో చేపట్ట నున్న సర్వే సమయానికి అడవుల్లో చెట్ల ఆకు లు రాలిపోయి కెమెరాలు బిగించడం కొంత సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అటు ట్రాప్ కెమెరాలో వీడియోలు సైతం రికా ర్డవడానికి అనువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతం నుంచి నిపుణులను రప్పించనున్నారు. ఈ దఫా సర్వేలో పాపికొండల అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. గడచిన నాలుగేళ్లలో వీటి సంతానం కూడా బాగా వృద్ధి చెంది ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి పోల వరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం బాగా పెరిగిందని అటవీశాఖ అంచనా వేసింది. ప్రధానంగా రంప అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుతలు 12 వరకు ఉంటాయని చెబుతున్నారు.

గతేడాది ఇలా..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న పాపి కొండల అభయారణ్యం నుంచి గతేడాది దారి తప్పి పులులు జనావాసాల్లోకి వచ్చేసిన సం ఘటనలను గుర్తు చేస్తున్నారు. గతేడాది ఫిబ్ర వరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండల అభయారణ్యం నుం చి వచ్చింది. అక్టోబరులో ప్రత్తిపాడులో పులి సంచారం ఆనవాళ్లు బయటపడ్డాయి. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది. గతేడాది సెప్టెంబరులో రాజ మహేంద్రవరం నగరంలోకి చిరుత పులి దారితప్పి వచ్చేసింది. ఇది పాపికొండల అభయారణ్యం నుంచే వచ్చిందని గుర్తించా రు.అప్పట్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు అడవుల్లో పులులు, చిరుతల స్థావరాలు చెల్లాచెదురయ్యాయి. దీంతో కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో చిరుత గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అప్పట్లో అంచనా వేశారు. పాపి కొండల అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతం లోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చి ఉం డొచ్చని భావించారు. ప్రధానంగా ఈ తరహా సంఘటనలు 2022 నుంచి 2024 మధ్యే ఎక్కువగా జరిగాయి. పాపికొండల అభయా రణ్యంలో పెరిగిన పులుల సంచారానికి ఈ ఘటనలు నిదర్శనంగా భావించొచ్చని అధి కారులు విశ్లేషిస్తున్నారు. వచ్చే ఏడాది మే తర్వాత ఈ లెక్కకు సంబంధించి దాదాపు స్పష్టత రావొచ్చని చెబుతున్నారు.



నాటు కోడినీ.. వదల!

బర్డ్ ఫ్లూతో నాటు కోళ్లు మృత్యువాత

- పెంపకందారుల్లో భయం
- అక్కడక్కడా మృత్యువాత
- కానూరులో ఫారాలు ఖాళీ
- 500 నాటుకోళ్లు మృతి
- యజమానుల లబోదిబో
- శానిటేషన్‌కు చర్యలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి) : బర్డ్ ఫ్లూ భయపెడుతోంది.. కోళ్ల రైతులు, పెంపకందారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కరోనా జనంపై ఎంత ప్రభావం చూపిందో ప్రస్తుతం బర్డ్ ఫ్లూ కోడిపై అంత ప్రభావం చూపిస్తుంది.. బర్డ్ ఫ్లూ సోకిందంటే అప్పటి వరకూ ఆరోగ్యంగా కని పించిన కోడి క్షణాల్లో మృత్యుఒడికి చేరుతోంది. ఈ వైరస్ లేయర్, బ్రాయిలర్ కోళ్లనే కాదు.. నాటు కోళ్లపై కూడా ప్రభావం చూపుతోంది. దీంతో కోళ్లను పెంచేవారు భయాందోళనకు గురవుతున్నారు.బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కోళ్ల ఫారాల్లో కోళ్లన్నీ ఖాళీ అయిపోయాయి. అటు ఫారం ఇటు నాటు కోళ్లు కూడా లేకుం డా పోయాయి. వైరస్ కానూరు అగ్రహారంలో నాటు కోళ్లకూ పాకింది. దీంతో ఇళ్లల్లోని నాటు కోళ్లన్నీ వాటంతట అవే మృత్యువాత పడ్డాయి. ఖరీదైన కోళ్లు కూడా కళ్ల ముందే చనిపోయా యి.వాటిని దూరంగా పాతి పెట్టారు. మొత్తంగా కానూరు అగ్రహారం కోళ్ల ఫాంలలో 84 వేల కోళ్లు మృత్యువాత పడగా.. మిగిలిన 3 వేల వరకూ కోళ్లకు మత్తు మందు ఇచ్చి గోతుల్లో పూడ్చేశారు. మంగళవారం వైరస్ సోకిన 45 నాటుకోళ్లను స్వాధీనం చేసుకొని పూడ్చి పెట్టగా.. బుధవారానికి సుమారు 500 వరకూ నాటుకోళ్లు చనిపోయాయి. ఫారం కోళ్లతో పోలి స్తే వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండే నాటు కోళ్లకు కూడా వైరస్ ఒకేలా పని చేస్తుందని వెటినరీ వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన వెంటనే తగు జాగ్రత్తలతో కోడిని పాతి పెట్టేయాలి.. లేకపోతే వైరస్ కోళ్ల నుంచి మనుషులకు సంక్రమించే అవకాశం ఉం దన్నారు. కాగా.. బర్డ్ ఫ్లూ వైరస్ సాధారణంగా వలస పక్షుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. వందల వేల కిలోమీటర్ల నుంచి వలస వచ్చే పక్షుల్లో ఈ వైరస్ ఉంటే వాటి విసర్జితాల ద్వారా స్థానికంగా చాలా సులభంగా పాకి పోతుంది. గాలి ద్వారా కూడా బర్డ్ ఫ్లూ వైరస్ విస్తృతమవుతుంది.ఈ వైరస్ అత్యంత వేగంగా సోకడంతో పక్షులు, కోళ్లు గుంపులు గుంపులుగా చనిపోతాయి. ముఖ్యంగా తగు జాగ్ర త్తలు తీసుకోకపోతే మను షుల ద్వారా ఈ వైరస్ ఎక్కువగా విస్తృత మయ్యే అవకాశం ఇచ్చినట్లే. వైరస్ సోకిన ప్రాంతానికి వెళ్లి అదే వస్త్రాలతో వేరొక చోటికి వెళితే అక్కడి కోళ్లకు ఫ్లూ వస్తుంది. అందువల్ల వైరస్ సోకిన చోటుకు వైద్యులు మినహా ఎవ రూ వెళ్లకూడదు.బర్డ్ ఫ్లూ వైరస్ ఊపిరి తిత్తులు, గాలి వాహికలో తిష్ట వేసి నాశ నం చేస్తుంది.కోళ్లను పాతి పెడితే వాటికి సోకి న వైరస్ భూస్థాపితం అయినట్లేనన్నారు. ముం దస్తు జాగ్రత్తలో భాగంగా గురువారం నుంచి ఫారాల్లో శానిటైజేషన్ చేస్తామని జిల్లా పశు సంవర్ధకఅధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వైరస్‌తో చనిపోయిన కోళ్లు తినవద్దు!

ఐఎంఏ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలెవరు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజమ హేంద్రవరం అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజ యకుమార్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్ల బ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. సాధార ణంగా వచ్చే దగ్గు, వంటి నొప్పులు, జ్వరం, కండరాలు నొప్పులు వంటివే బర్డ్ ఫ్లూ అని చెప్పారు. ఈ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కోళ్ళ ఫారాల్లో బర్డ్‌ఫ్లూ ఉండడంతో ఫారాల్లో పనిచేసేవారికి సోకే అవకాశం ఉం దన్నారు.పౌల్ట్రీ ఫారాల్లో పని చేసేవారు మా స్కులు, చేతులకు గ్లౌజ్‌లు వేసుకుని పనిచేస్తే వైరస్ బారిన పడరని చెప్పారు. వైరస్‌తో చనిపోయిన కోళ్లను తినకూడదన్నారు. బాగా ఉడికించిన కోడి మాంసం, గుడ్లను తినడం వల్ల ప్రమాదం రాదన్నారు. బర్డ్ ఫ్లూ మ్యూటేషన్ చెందితే ప్రమాదం ఉంటుందని అయితే ప్రజలు అధిక సంఖ్యలో బర్డ్ ఫ్లూ బారిన పడి నప్పుడే మ్యూటేషన్ అనేది జరుగుతుంద న్నారు.ప్రస్తుతం భయపడాల్సిన పనిలేద న్నారు.సమావేశంలో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ గుప్తా, డాక్టర్ వడ్డాది సురేష్, డాక్టర్ శేషాద్రి రెడ్డి, డాక్టర్ పాండురంగరాజు,డాక్టర్ సుమన్, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

సమాచారం సకాలంలో ఇవ్వకపోతే ఎలా ?

డీఈవో వాసుదేవరావు అసహనం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కార్యాలయానికి స మర్పించాల్సిన ముఖ్యమైన సమాచారాన్ని సమయానికి అందజేయకపోవడం విచార కరమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదే వరావు అన్నారు. రాజమహేంద్రరం ఎస్‌కే వీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజమ హేంద్రవరం అర్బన్‌లోని ప్రైవేట్ పాఠశాల ల ప్రధానోపాధ్యాయులతో బుధవారం స మావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమైన సమాచారాన్ని సకాలంలో ఇవ్వాలన్నారు. సమ్మెటివ్ మార్కులను ఆన్‌లైన్ చేయడం, యు డైస్ అప్‌డేట్ కాకపోవడం, అపార్ సంఖ్యలు నూరుశాతం పూర్తిచేయకపోవ డంపై అసహనం వ్యక్తం చేశారు.శనివా రంలోపు విద్యాశాఖ సూచించిన పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నిక సజావుగా జరగాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి) : ఎన్నికలు సజావుగా జరి గేలా అన్ని చర్యలు తీసుకోవాలని గ్రాడ్యు యేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ప్రిన్సి పల్ సెక్రటరీ కె. సునీత పేర్కొన్నారు. పెరవ లిలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించి మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తు న్నందున ఎటువంటి పొరపాట్లు లేకుం డా ఎన్నికలు జరిగేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. పోలింగ్ రోజున ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఓటర్ల స్లిప్‌లు జారీ, పోలింగ్ సామగ్రి ముందస్తుగా తరలిం చాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారిగా టి. సీతారామ మూర్తి వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.జిల్లాలో 82 పోలింగ్ కేంద్రాలను, 10 యాక్సెలరీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

టెన్త్‌కు ఎస్సీ హాస్టల్స్ విద్యార్థులు 178 మంది హాజరు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మార్చి నెలలో జరిగే టెన్త్ పరీక్షలకు జిల్లాలోని ఎ స్సీ హాస్టల్స్‌లో చదువుకుంటున్న 178 మం ది విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎంఎస్ శో భారాణి తెలిపారు. ఈమేరకు టెన్త్ విద్యా ర్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా మని, వారి ఉత్తీర్ణత శాతం పెరిగేలా అవ సరమైన చర్యలు చేపడుతున్నామని తెలి పారు. టీచర్స్ రూపొందించిన స్టడీ మెటీరి యల్ ఇప్పటికే విద్యార్థులకు అందజేశామ న్నారు. స్కూల్స్‌లో ప్రత్యేక అదనపు తరగ తులు నిర్వహిస్తున్నారని, అలాగే హాస్టల్స్ లోనూ చదివిస్తున్నామని తెలిపారు. ఈ ఏ డాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృ షి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ చదవాలని.. టెన్త్‌లో వచ్చే మా ర్కులపై భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు.

రెవెన్యూ తప్పులను సరిచేస్తాం : జేసీ

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రికార్డుల్లో పొరపాట్లు సరి చేసుకోవడడానికి రైతులు జిల్లా కార్యాల యాల చుట్టూ తిరగకుండా అధికారులే మీ వద్దకు వచ్చి పరిష్కరించడం జరు గుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అ న్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలో రైతులకు సంబంధించి భూ,రెవెన్యూ రికార్డుల్లో తప్పులు, వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ పొరపా ట్లను సరిచేసి రైతులకు పత్రాలు పంపి ణీ చేశారు. ప్రతి మంగళ, బుధవారాలు కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి ఆర్డీ వో కార్యాలయంలో రైతుల నుంచి వచ్చి న రెవెన్యూ ఫిర్యాదులను పరిశీలించి, తప్పులను సరిచేసి రైతులకు సరిచేసిన పత్రాలను ఆర్డీవో కార్యాలయంలోనే పం పిణీ చేస్తామన్నారు.9 మండలాల ప్ర జలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొవ్వూరులో రామ్ సినిమా షూటింగ్ సందడి 8


పెండ్యాల ర్యాంపులో సాగుతున్న ఇసుక తవ్వకాలు

తవ్వేయ్..అమ్మేయ్!

ఉచిత ఇసుక విధానానికి కూటమి నాయకుల తూట్లు

నిడదవోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభు త్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకాన్ని ఆ పార్టీ నాయకులే పక్కదారి పట్టిస్తున్నారు.పేద,మధ్య తరగతి ప్రజల ఇళ్ల నిర్మా ణానికి ట్రాక్టర్ల ద్వారా ర్యాంపుల నుంచి ఉచితంగా ఇసు కను తీసుకువెళ్లవచ్చునన్న ప్రభుత్వ విధానానికి తూట్లు పొడుస్తు న్నారు. టీడీపీకి చెందిన ఒక నాయకుడి అండదండలతో కొం దరు దళారులు వరంగా మార్చుకున్నారు.దీంతో ఇసుక మాఫి యా అక్రమ ఇసుక విక్రయాలకు తెరలేపింది. నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి అనధికారికంగా ఇసుక తరలిపోతోంది. కూటమి ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జీలను తుంగలో తొక్కి అనధి కారికంగా అధిక సొ మ్ములు వసూలు చేస్తున్నారు. టీడీపీకి చెందిన ఒక నాయకుడి అండదండలతో ఒక మండల నాయకుడు పెండ్యాల ఇసుక ర్యాంపును సొంత ర్యాంపుగా మార్చేసు కున్నాడనే విమర్శలు న్నాయి. పేరుకు మాత్రం రోజుకు 25 నుంచి 50 వరకు లారీలకు ఇసుక సరఫరా చేస్తున్నట్టు అధికారికంగా చూపిస్తూ అనధికారికంగా 100 నుండి 150 లారీల వరకు ఇసుక తరలిం చేస్తున్నారని ఇసుక ర్యాంపుల వద్ద బాహాటంగా విమర్శిస్తున్నా రు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతూ ఇసుక విక్రయాల సొమ్మును స్వంత ఖాతాలకు పక్కదారి పట్టిస్తు న్నారు. అయినా ప్రభుత్వ అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని ర్యాంపుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.అయినా చర్యలు శూన్యం.జిల్లా ఉన్నతాధికారులు ర్యాంపులపై దృష్టి సారించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వెంకయ్యను కలిసిన పిక్కి నాగేంద్ర


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యతో నాగేంద్ర

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పట్టణానికి విచ్చేసిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి ఆయనకు వివరించారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ జిల్లాలో బీజేపీని బలోపేతం కావడానికి నిరంతరం కృషి చేసి, మంచి నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.

తీరంలో ముగిసిన మహా సౌరయాగం


మహా పూర్ణాహుతి సమర్పిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ దంపతులు

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణార్థం గత 14 రోజులుగా గోదావరి తీరంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగం బుధవారంతో ముగిసింది. పట్టణంలోని రోడ్డు కం రైలు బ్రిడ్జి 'స మీ 'పం లోని శ్రీనివాస స్నానఘట్టంలో వేంచేసియున్న ప్రకృతి రావణబ్రహ్మ శివా లయ క్షేత్రంలో సూర్య ఉపాసకులు విక్రమాదిత్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ, వాణి స్వరాజ్యలక్ష్మి దంపతులు ముగింపు సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సుమారు రెండువేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మన్నె పద్మ, పాలకోడేటి సత్యనారాయణమూర్తి, మద్దుకూరి వెంకటేశ్వరరావు, ఎం. నాగసాయి, గంగరాజు, బంగారం, ధనలక్ష్మి, బేబి,సౌమ్య, రేకమండ రమేష్, భక్తులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

● అఖిల భారత క్రీడా ఫౌండేషన్ అధ్యక్షురాలు, భారత స్కేటింగ్ క్రీడాకారిణి సోనీ చౌరాసియా


చాగల్లు హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి ముచ్చటిస్తున్న సోనీ చౌరాసియా

చాగల్లు, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి: క్రీడలపై బాలికలు మక్కువ పెంచుకోవాలని అఖిల భారత క్రీడా ఫౌండేషన్ అధ్యక్షురాలు, భారత స్కేటింగ్ క్రీడాకారిణి సోనీ చౌరాసియా అన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచడం, పర్యావరణం పరిరక్షణ, వినియోగదారుల పరిరక్షణ, స్త్రీ విద్యను పెంపొందించడం, మాతృభూమి పట్ల ప్రేమ భావాలను కలిగించే వంటి లక్ష్యాల కోసం దేశ పర్యటన చేస్తున్నారు. వారణాసి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర రాజమహేంద్రవరం, కొవ్వూరు, పశివేదల మీదుగా చాగల్లు మండలం నెలటూరులోకి ప్రవేశించింది. ఈసందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు తాళ్ళూరి వరప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం పలు విషయాలపై ఆమె మాట్లాడారు. అన్ని రంగాల్లో బాలికలు రాణించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గ్రంధి రాంబాబు, మద్దిపాటి సురేష్, జుట్టా గణపతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని తీరుగూడెం ప్రాంతంలో నూతన సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం గురువారం తీరుగూడెం, శింగవరం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఓపెన్ ఇసుక రీచ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ



తాడిపూడిలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీ సుస్మిత

తాళ్లపూడి, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి : తాడిపూడి, ప్రక్కిలంకలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇసుక రీచ్‌లపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. తాడిపూడిలో ఆర్డీవో రాణీ సుస్మిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు అభ్యంతరాలు, అంగీకారాలు తెలపమని కోరగా, పలువురు గ్రామస్థులు స్పందించి మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వల్ల గ్రామానికి జరిగే మేలేమిటని దుమ్మూధూళి, వచ్చిపోయే లారీలతో ట్రాఫిక్ వాటిల్లుతుందన్నారు. తాడిపూడి ఓపెన్ రీచ్‌లో 49.33 హెక్టార్ల పరిధిలో 4 లక్షల 93 వేల 300 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు ప్రక్కిలంకలో 47 హెక్టార్ల పరిధిలో 4 లక్షల 70 వేల క్యూబిక్ మీటర్ల మేర ఇసుక తవ్వకాలకు ప్రతిపాదించగా, ఈ అనుమతులు ఇచ్చేందుకు ఏడీ మైన్స్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఎస్వీ, ఎన్విరో ప్రతినిధి డీ. రామలింగయ్య మాట్లాడుతూ పర్యావరణ,కాలుష్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో రామండ్రి పర్యావరణ పరిరక్షణ కమిటీ ప్రతినిధి జెబి రామారావు, సర్పంచ్ నామా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భీమరాజు, నామా సురేంద్ర, గర్రే కిషోర్, తదితరులు పాల్గొన్నారు. ప్రక్కిలంకలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. సతీష్ అధ్యక్షతన ఇన్‌చార్జి తహసీల్దార్ పి. మోహన భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ మైన్స్ ఫణిభూషన్ రెడ్డి, కాకినాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకరరావు, మాజీ ఎంపీపీ కొప్పాక కోట్నీస్, నాయుడు హనుమంతరావు, యాళ్ల బాబూరావు, ఇండుగుల రామకృష్ణ, ఎన్డీయే కూటమి నాయకులు, రెవెన్యూ సిబ్బంది పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ని గెలిపించండి : ఎమ్మెల్యే


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, తదితర కూటమి నేతలు

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, మద్దూరు, సీతంపేటలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు, పాఠశాలలు, సొసైటీలు, బ్యాంకుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల కాల వ్యవధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎన్నో ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకార్ల నారాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జిలు మరపట్ల కళాధర్ చక్రవర్తి, పెనుమాక జయరాజు, నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యులు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, కూటమి నాయకులు, బూత్ ఇంచార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రీజనల్ కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్లస్ టు పాఠశాలలను జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ రీజియన్ కన్వీనర్ ఆంజనేయరాజు అధ్యక్షతన రీజనల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్. సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటుచేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఇప్పటికే ఎనిమిదినెలల కాలం ఆలస్యం అయ్యిందన్నారు. అలాగే ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ప్రావిడెంటు ఫండ్ మొత్తాలను, సరెండర్ లీవులను, పీఎఫ్, పాక్షిక రుణాలను, 11వ పీఆర్సీ బకాయిలను, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డేనియల్‌బాబు, కొవ్వూరు, తాళ్ళపూడి, దేవరాపల్లి, చాగల్లు, గోపాలపురం మండలాలకు చెందిన ఎస్టీయూ శాఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా అనుయాదవ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా అనుయాదవ్‌ను నియమించినట్టు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాస్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం నియామక పత్రాన్ని అనుయాదవ్‌కు అందించారు. మానవహక్కులు, వినియోగదారుల చట్టం, మానవ అక్రమ రవాణా, బాలికలపై వేధింపులు, తదితర అంశాలపై బాధితుల పక్షాన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రతినిధులు ఎన్. ఝాన్సీ యెనుముల రుక్మిణి, చిన్నయేసు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠ


హోమగుండం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి: ప్రక్కిలంకలో బుధవారం గ్రామ దేవత మావుళ్లమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవము, మహాచండీ యాగాన్ని ఆగమద్యుమణి బ్రహ్మశ్రీ కౌతారపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం గణపతి, మండప పూజలు చేశారు. అనంతరం మహిళలు గోదావరీ జలాలను ఊరేగింపుగా తెచ్చి ఆలయ ప్రవేశంతో అమ్మ వారికి జలాభిషేకం గావించారు. తర్వాత పూర్ణాహుతి నిర్వహించారు. ఐదురోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. భారీ అన్నసమారాధనను ఏర్పాటు చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు


దేవరపల్లిలో ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గరుడ వాహనం పై అలంకరించి మాడవవీధుల్లో ఊరేగించారు. ఆదిశంకరాచార్య ధ్యానమందిరం వద్ద మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా విఘ్నేశ్వరుడు, మహాలక్ష్మి, సరస్వతి అమ్మవార్లకు అభిషేకాలు గావించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేళ్లచింతలగూడెంలో.. నేను బడికిపోతా


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోపాలపురం, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి: వేలచింతలగూడెంలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం ఎన్సీహెచ్ రత్నకుమారి, సీఆర్పీ కొయ్య నాగరాజు, టీచర్లు హేమశిరీష, శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త హేమలత, కమలకుమారి, ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరులో రామ్ సినిమా షూటింగ్


కొవ్వూరు లాంచీల రేవు వద్ద రావురమేష్‌పై సన్నివేశం చిత్రీకరణ

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మైత్రి మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న హీరో రామ్ పోతినేని 22వ సినిమా చిత్రీకరణ కొవ్వూరు పట్టణంలో బుధవారం జరిగింది. లాంచీలరేవు వద్ద గల గోదావరి ఏటిగట్టు రోడ్డుపై రావు రమేష్ సైకిల్‌పై తన కొడుకుని ఎక్కించుకుని వెళ్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా రామ్ పోతినేని, మిస్టర్ బచ్చన్ సినిమాలో నటించిన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా, ప్రధాన తారాగణం రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్దన్ నటిస్తున్నారు. సంగీతం వివేక్ మార్విన్ అందిస్తున్నారు. మరో 40 రోజుల పాటు గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలలో షూటింగ్ జరుగుతుందని దర్శకుడు మహేష్‌బాబు, ప్రొడక్షన్ డిపార్టుమెంట్ సభ్యు లు చెప్పారు. దీంతో రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా ఏలూరు వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పెద్దసంఖ్యలో జనాలు గుమిగూడారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

● కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు



పాడి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

నల్లజర్ల, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి: కో ఆపరేటివ్ సెక్టార్‌లో రైతుల సంక్షేమం కోసం పని చేసే ఏకైక సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్ అని ఆ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ (విజయడైయిరీ) 60వ వార్షికోత్సవ వజ్రోత్సవ వేడుకలు బుధవారం నల్లజర్లలోని అల్లాడ రామకృష్ణ కల్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాడి రైతులకు భరోసా కల్పించేలా నమ్మకంతో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు,బోర్డు డైరెక్టర్లు దాసరి వెంకట బలవర్దనరావు, అర్జా వెంకట నగేష్, బొట్టు రామచంద్రరావు, నెక్కలపు వాణిశ్రీ, శివ జ్యోతి, ఘంటా నాగేశ్వరరావు, మేనేజర్ మూర్తి,ముసుళ్లకుంట పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నందమూరి రామకృష్ణ, పెండ్యాల వీరరాఘవులు, అల్లూరి శ్రీనివాసరావు, మందిపాటి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు

సంఖ్య నమోదు తప్పనిసరి : ఏవో


వాదాలకుంటలో విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేస్తున్న ఏవో రాజారావు

గోపాలపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి రాజారావు అన్నారు. వాదాలకుంట, గోపాలపురంలోని రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రైతుకు గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

భూమి ఉన్న రైతులు ఆధార్‌కార్డుతో పాటు తమ భూమికి సంబంధించిన పత్రాలను సంబంధిత రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ సహాయకులకు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ ఉద్యాన సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం సభ్యులు

గోపాలపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ గిరిజన సంఘం అటవీ హక్కుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని బుధవారం దొండపూడిలో ప్రదర్శన నిర్వహించారు. ఏజెన్సీ గిరిజన సంఘం, ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా గిరిపుత్రుల సంక్షేమా న్ని పాలకులు పక్కనపెట్టారని ఆరోపించారు. సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు అడవులతోపాటు దానిలో దాగి ఉన్న అపారమైన సంపదను అప్పగించటం కోసం కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరిస్తామని చెప్పటాన్ని ఏజెన్సీ గిరిజన సంఘాలు పూర్తిగా ఖండిస్తున్నాయన్నారు. ఆదివాసీ సంక్షేమ చట్టాలను పటిష్టం చేసి పీసా చట్టాన్ని అమలు చేయాల న్నారు. అలాగే జీవో నెం.3ను పునరుద్ధరించా లని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా, దాడి రాముడు, సింగరాజు, పరమేష్, మడకం పోశమ్మ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే


కానూరు అగ్రహారంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం కానూరు అగ్రహారంలో బర్డ్‌ఫ్లూ కారణంగా కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కానూరు అగ్రహారం, మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్లు కె. హేమరాజు, పి. తేజశ్రీ ఆధ్వర్యంలో కానూరుఅగ్రహారంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మండలంలో 20 వైద్యబృందాలు ఇంటింటా సర్వే చేపడుతున్నాయి. సీహెచ్‌వో కె. జయమణి, ఎంపీహెచ్‌ఈవో సత్యేంద్రకుమార్, సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు కట్నం తెమ్మని..

● వేధిస్తున్న భర్త, అత్తమామపై కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె. జగన్మోహనరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం .. కొవ్వూరు పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన వల్లూరి కామాక్షికి, వెంకటేష్‌తో 2010 సెప్టెంబర్ 1వ తేదీన వివాహం జరిగింది. ఆ సమయంలో రూ. రెండు లక్షల కట్నం, రూ. 50వేలు పసుపు, కుంకుమ, రూ. 70 వేలు సారి సామాన్లుగా అందించారు. ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత భర్త వెంకటేష్ చెడు వ్యసనాలకు బానిసై రూ. లక్ష అదనపు కట్నం తెమ్మని వేధింపులకు గురి చేస్తుండడంతో ఈ నెల 12వ తేదీన కామాక్షి పట్టణ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.ప్రస్తుత సమాజంలో అదనపు కట్నం తేవాలని వేధించడం సరికాదన్నారు.

మహిళ ఇంట్లో చొరబడి.. అసభ్యంగా ప్రవర్తించి

● ముగ్గురిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కే. జగన్మోహనరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... ఈనెల 10వ తేదీన కొవ్వూరు పట్టణానికి చెందిన సింగులూరి జగదీశ్వరి ఇంట్లోకి అంకోలు శ్యామ్‌పవన్, అంకోలు విజయ్‌కుమార్, చందూ అక్రమంగా ప్రవేశించారు. దీంతో సదరు మహిళ ప్రశ్నించడంతో కొట్టి, చీర లాగి అసభ్యకరంగా ప్రవర్తించారు. అడ్డువచ్చిన జగదీశ్వరి కుమార్తెను కూడా నెట్టివేసి, కాళ్లతో తన్నారు. దీంతో ఆమె గట్టిగా కేకలు పెట్టడంతో ముగ్గురూ అక్కడ నుంచి పారిపోయారని పట్టణ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.